www.prajavinikidi.com
RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

సంపుటి - 4 సంచిక -17 శుక్రవారం 1 మే 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక
తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
8978701613,7013016545

# కార్మికవర్గ స్ఫూర్తితో ముందుకెళ్తున్నాం

**జవాబుదారీతనం పెంచేందుకే సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానం**

**విద్యార్థులకు సకాలంలో పాఠ్య సామగ్రి అందాలి**

**ప్రతి విద్యార్థి నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలి : సంక్షేమ శాఖలపై సమీక్షలో ముఖ్యమంత్రి**

**కార్మికవర్గ స్ఫూర్తితో ముందుకెళ్తున్నాం**

**-మేడే శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్‌రెడ్డి**



**హైదరాబాద్:(ప్రజావినికిడి):**
విద్యార్థులకు పాఠ్య సామగ్రి సరఫరా విషయంలో సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానం ద్వారా జవాబుదారీతనం పెరుగుతుందని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అన్నారు.**మిగతా 2లో...**



# హార్మూజ్‌కి కొత్త దశ

**అమెరికా వ్యూహాలు బెడిసికొట్టాయి: ఖమేనీ**

**పుతిన్ తో ఫోన్లో మాట్లాడిన ట్రంప్**

**మళ్లీ దాడి చేయొద్దని రష్యా హెచ్చరిక**

**సడలని యుద్ధ భయాలు గల్ఫ్ షేర్లు పతనం**




**న్యూఢిల్లీ (ప్రజావినికిడి):**
పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రమవుతున్నాయి. కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉన్నప్పటికీ ఇరు దేశాల మధ్య మాటల యుద్ధం నడుస్తుంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్ లొంగిపోవాలని**మిగతా 2లో...**

## తెలుగు రాష్ట్రాలకు చల్లటి కబురు

**తమిళనాడు మీదుగా**

**మన్నార్ గల్ఫ్ వరకు ద్రోణి**

**తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం**



# కెరీర్ బిల్డింగ్ లక్ష్యం


**యూనివర్సిటీల్లో కోర్సుల రీస్ట్రక్చరింగ్**

**విద్యాశాఖ సమీక్షలో సిఎం చంద్రబాబు ఆదేశం**

**ప్రాథమిక స్థాయి నుండి పిజి వరకు పాఠ్యాంశాల మార్పు**

**పరిశోధన, ఆవిష్కరణల కేంద్రాలుగా విశ్వవిద్యాలయాలు**

**అమరావతి(ప్రజావినికిడి):**
రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు అందిస్తోన్న వివిధ కోర్సులను రీస్ట్రక్చరింగ్ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. సచివాలయంలో గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత, భవిష్యత్ అవసరాలను అందిపుచ్చుకునేలా ప్రాథమిక స్థాయి నుంచి పిజి వరకూ వివిధ పాఠ్యాంశాలను మార్పు చేయాలన్నారు. కెరీర్ బిల్డింగ్, కేరక్టర్ బిల్డింగ్ జరిగేలా విద్యా వ్యవస్థ ఉండాలన్నారు. ఆరోగ్యం, టెక్నాలజీతో పాటు బెస్ట్ ప్రాక్టీసెస్‌ను నేర్పించేలా ఈ పాఠ్యాంశాలు ఉండాలని సూచించారు. రీసెర్చ్, ఇన్నోవేషన్, స్టార్టప్‌లను ప్రోత్సహించేలా విద్యా వ్యవస్థ మార్పులను**మిగతా 2లో...**



## బీసీ సంక్షేమ శాఖ అభివృద్ధి సలహాదారుగా వీహెచ్ నియామకం



# కాలానికి అనుగుణంగా చట్టాలు

**లైంగికదాడికి గురైన బాలిక గర్భవిచ్ఛిత్తిపై సుప్రీం కీలకవ్యాఖ్యలు**

**ఆ ఘటన వారిని జీవితాంతం వెంటాడుతుంది : సీజేఐ**

**బాధిత బాలిక, ఆమె తల్లిదండ్రులదే తుది నిర్ణయమని స్పష్టం**

**లైంగికదాడికి గురైన బాలిక గర్భవిచ్ఛిత్తిపై సుప్రీం కీలకవ్యాఖ్యలు**

**న్యూఢిల్లీ : (ప్రజావినికిడి):**
లైంగికదాడి కారణంగా గర్భం దాల్చిన బాలికకు గర్భవిచ్ఛిత్తిపై ఎలాంటి పరిమితులు లేకుండా చట్ట సవరణ చేయాలని కేంద్ర ప్రభుత్వానికి సర్వోన్నత్య న్యాయస్థానం సూచించింది. చట్ట పరమైన వ్యవస్థ కాలంతో పాటు మార్పు చెందాలనీ, బాధితుల గౌరవానికి ప్రాధాన్యత ఇవ్వాలని ధర్మాసనం స్పష్టం చేసింది. గర్భవతి అయిన బాధిత బాలిక విషయంలో ఎయిమ్స్ దాఖలు చేసిన క్యూరే టీవ్ పిటిషన్‌పై గురువారం**మిగతా 2లో...**



# దేశానికే ఆదర్శం

## తెలంగాణలో అక్రిడిటేషన్ల జారీ..



**అక్రిడిటేషన్ల సంఖ్య తేలితే జర్నలిస్ట్‌లకు మరిన్ని సౌకర్యాల కల్పన..**

**గతం కంటే ఇప్పుడు రెట్టింపు సంఖ్యలో అక్రిడిటేషన్ల మంజూరు..**

**మే10లోగా దరఖాస్తు చేసుకున్న వారందరికీ అక్రిడిటేషన్లు..**

**మే1 అన్ని జిల్లాల్లో అక్రిడిటేషన్ల పంపిణీకి కలెక్టర్లకు ఆదేశం..**

**మే 15వరకు అందరికీ బస్సు పాస్‌ల పొడిగింపు..**

**రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలు,**

**రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి..**

**హైదరాబాద్, (ప్రజావినికిడి):**
రాష్ట్రంలో అర్హులైన ప్రతి జర్నలిస్ట్‌కు అక్రిడిటేషన్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలు, రెవెన్యూ,హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు పాత్రికేయులకు ఆరోగ్యంతోపాటు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందని అన్నారు.**మిగతా 2లో...**



# ఇంధన సరఫరాకు ఎలాంటి కొరత లేదు

**కొరత భయాలతో పెట్రోల్ బంకులకు ప్రజలు క్యూ కట్టవద్దని కిషన్ రెడ్డివిజ్ఞప్తి**

**నిన్న పెట్రోల్ వినియోగం రోజువారి సగటుతో రెండింతలు, డీజిల్ రెండున్నర రెట్లు పెరిగినట్లు వెల్లడి**

**హైదరాబాద్: ఏప్రిల్ 30(ప్రజావినికిడి):**
తెలంగాణ రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ సరఫరాకు ఎలాంటి కొరత లేదని, ప్రజలు ఆందోళన చెందవద్దని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఇంధన కొరత భయాలతో హైదరాబాద్ నగరం **మిగతా 2లో...**

# బాలికలదే పైచేయి

**ఏపీ టెన్త్ ఫలితాల విడుదల..**

**మొత్తం 85.25 శాతం ఉత్తీర్ణత నమోదు**

**బాలికల ఉత్తీర్ణత శాతం 87.90%.. బాలుర ఉత్తీర్ణత 82.68%**

**గత ఏడాదితో పోలిస్తే 4 శాతానికి పైగా పెరిగిన ఉత్తీర్ణత**

**ప్రభుత్వ పాఠశాలల్లోనూ మెరుగైన ఫలితాలు**




**అమరావతి ఏప్రిల్ 30(ప్రజావినికిడి):**
ఏపీలో పదో తరగతి విద్యార్థుల నిరీక్షణకు తెరపడింది. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఉదయం 11 గంటలకు టెన్త్ పబ్లిక్ పరీక్షల ఫలితాలను విడుదల చేశారు. ఈ ఏడాది మొత్తం 85.25 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ఆయన ప్రకటించారు. గత ఏడాదితో పోల్చి చూస్తే ఉత్తీర్ణత శాతం 4 శాతానికి పైగా పెరగడం గమనార్హం.

**బాలికల హవా.. మెరుగైన ప్రభుత్వ పాఠశాలలు**
ఎప్పటిలాగే ఈసారి కూడా పదో తరగతి ఫలితాల్లో బాలికలు తమ సత్తా చాటారు. బాలికల ఉత్తీర్ణత శాతం 87.90% కాగా, బాలుర ఉత్తీర్ణత 82.68% వద్ద నిలిచింది. దీంతో బాలురపై బాలికలు స్పష్టమైన ఆధిక్యం కనబరిచారు. అదే సమయంలో ప్రభుత్వ పాఠశాలల పనితీరు కూడా మెరుగుపడింది.**మిగతా 2లో...**

# బాలికలదే పైచేయి

**మొదటిపేజీ తరువాయి**

ప్రభుత్వ పాఠశాలల్లో ఈసారి 78.39 % ఉత్తీర్ణత నమోదైంది. గతేడాది(72.8%)తో పోలిస్తే ప్రభుత్వ బడుల్లో ఉత్తీర్ణత శాతం పెరగడం రాష్ట్ర విద్యావ్యవస్థకు సానుకూల సంకేతంగా భావిస్తున్నారు.

ఫలితాల విడుదల అనంతరం మంత్రి లోకేశ్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, పేరెంట్స్‌కు అభినందనలు తెలియజేస్తూ ప్రత్యేకంగా ట్వీట్ చేశారు. "ఈ ఫలితాలు మన విద్యార్థుల పట్టుదలను, ఉపాధ్యాయులు, కుటుంబాల బలమైన మద్దతును ప్రతిబింబిస్తాయి. విజయం సాధించిన వారందరికీ నా హృదయపూర్వక అభినందనలు. ఈసారి ఉత్తీర్ణత సాధించని వారు దయచేసి నిరాశ చెందవద్దు. ఫ్యామిలీ, ఉపాధ్యాయులు, సమాజం మద్దతుతో మీరు మరింత బలంగా తిరిగి వస్తారు. మన విద్యార్థులే ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుకు వెన్నెముక, ప్రతి బిడ్డ విజయం సాధించేలా చూడటానికి మేము కట్టుబడి ఉన్నాము" అని లోకేశ్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. కాగా, ఏపీలో మార్చి 16 నుంచి ఏప్రిల్ 1 వరకు పదో తరగతి పరీక్షలు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా 3415 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షలకు సుమారు 6.40 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 6,22,074 మంది రెగ్యులర్ విద్యార్థులు కాగా, 18,842 మంది ప్రైవేట్‌గా పరీక్షలు రాశారు. ఫలితాల విడుదలతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఉత్కంఠకు తెరపడినట్లయింది.

# గూడూరులో 45.8 డిగ్రీల ఉష్ణోగ్రత..

**ఏప్రిల్ 30(ప్రజావినికిడి):**

ఆంధ్రప్రదేశ్‌లో ఎండలు మండిపోతున్నాయి. నెల్లూరు జిల్లా గూడూరులో రికార్డ్ స్థాయిలో ఉష్ణోగ్రత నమోదైంది. గురువారం అక్కడ ఏకంగా 45.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. ఈ సీజన్‌లో రాష్ట్రంలో ఇదే అత్యధిక ఉష్ణోగ్రత కావడం గమనార్హం.

రాష్ట్రవ్యాప్తంగా 216 మండలాల్లో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) వెల్లడించింది. రానున్న రెండు రోజుల పాటు రాష్ట్రంలో భానుడి భగభగలు కొనసాగుతాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ హెచ్చరించారు. రేపు పార్వతీపురం మన్యం, పోలవరం జిల్లాల్లోని 9 మండలాల్లో తీవ్ర వడగాల్పులు వీచే అవకాశం ఉందని ఆయన తెలిపారు.మరోవైపు, ద్రోణి ప్రభావంతో కొన్ని జిల్లాల్లో అకాల వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ వివరించారు. రేపు శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, పోలవరం, నెల్లూరు, అనంతపురం, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడొచ్చని తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులు, వ్యవసాయ కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా వర్షం పడే సమయంలో చెట్ల కింద ఆశ్రయం పొందవద్దని ఆయన స్పష్టం చేశారు. ఒకవైపు తీవ్రమైన ఎండలు, మరోవైపు పిడుగులతో కూడిన వర్షాల హెచ్చరికలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరుతున్నారు.

# హర్మ్యూజ్‌కి కొత్త దశ

**మొదటిపేజీ తరువాయి**

ఇరాన్ ఓడరేవులపై అమెరికా నావికా దిగ్బంధనం గల్ఫ్‌లో అంతరాయాలను మరింత తీవ్రతరం చేస్తుందని, దాని లక్ష్యాలను సాధించడంలో విఫలమవుతుందని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ అన్నారు. సముద్ర దిగ్బంధనం లేదా ఆంక్షలను విధించే ఏ ప్రయత్నమైనా అంతర్జాతీయ చట్టానికి విరుద్ధమని, విఫలమవుతుందని పెజెష్కియన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటువంటి చర్యలు ప్రాంతీయ భద్రతను పెంపొందించడంలో విఫలమవడమే కాకుండా, పర్షియన్ గల్ఫ్‌లో ఉద్రిక్తతకు, శాశ్వత స్థిరత్వానికి అంతరాయానికి మూలమని ఆయన అన్నారు.

**ఇరాన్ పై దాడులు చేయొద్దు : పుతిన్**

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇరాన్‌పై దాడులను అమెరికా తిరిగి ప్రారంభించొద్దని ట్రంప్ నకు తెలిపారు. ఇరు దేశాల నేతలు గురువారం ఫోన్ లో మాట్లాడుకున్నారని, ఈ సందర్భంగా కాల్పుల విరమణను పొడిగించాలనే ట్రంప్ నిర్ణయం "సరైనది" అని పుతిన్ అన్నారని క్రెమ్లిన్ సహాయకుడు యూరి ఉషాకోవ్ విలేకరులకు తెలిపారు. అయితే, ఇరాన్ పై సైనిక చర్య తిరిగి ప్రారంభమైతే ఆ ప్రాంతానికి, ప్రపంచానికి చాలా నష్టం జరుగుతుందని పుతిన్ స్పష్టం చేశారని, అయితే ట్రంప్ ఉక్రెయిన్ పై యుద్ధాన్ని ముగించాలని పుతిన్ కు చెప్పారని ఉషాకోవ్ తెలిపారు.

# తెలుగు రాష్ట్రాలకు చల్లటి కబురు

### తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు ద్రోణి

### తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం

**హైదరాబాద్ /అమరావతి : ఏప్రిల్ 30(ప్రజావినికిడి):**:తెలుగు రాష్ట్రాల్లో ఎండలు దంచికొడుతున్న నేపథ్యంలో వాతావరణ శాఖ ఉపశమనం కలిగించే వార్త చెప్పింది. ద్రోణి ప్రభావంతో అటు ఆంధ్రప్రదేశ్, ఇటు తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వచ్చే మూడు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈదురు గాలులు సహా పిడుగులతో కూడిన జల్లులు కురుస్తాయని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. అమరావతి వాతావరణ కేంద్రం ప్రకారం.. దక్షిణ అంతర్గత కర్ణాటక నుంచి తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ. ఎత్తులో ద్రోణి విస్తరించి ఉంది. ఫలితంగా.. ఏపీలోని దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో మూడు రోజుల పాటు అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశముంది. గురువారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా పిడుగులతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే ఛాన్స్ ఉంది. ఈ నేపథ్యంలో గంటకు 50- 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశముంది. శుక్ర, శనివారాల్లో పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవడం సహా గంటకు సుమారు 40 - 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే ఛాన్స్ ఉంది. ఈ నేపథ్యంలో వేడి, తేమ సహా అసౌకర్యమైన వాతావరణ పరిస్థితులు ఏర్పడనున్నట్టు సమాచారం. హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకారం.. ద్రోణి/వాయు అస్థిరత ఇప్పుడు దక్షిణ అంతర్గత కర్ణాటక నుంచి తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ. ఎత్తులో విస్తరించి ఉంది.

## ఇంధన సరఫరాకు ఎలాంటి కొరత లేదు

**మొదటిపేజీ తరువాయి**

సహా పలు ప్రాంతాల్లో పెట్రోల్ బంకుల వద్ద వాహనాలు బారులు తీరుతున్నాయి. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం కొరత లేదని ప్రకటించింది. తాజాగా, కిషన్ రెడ్డి కూడా ఆందోళన అవసరం లేదని 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు.అంతేకాదు, తెలంగాణలో పెట్రోల్, డీజిల్ వినియోగం ఎలా పెరుగుతుందో గణాంకాలు పేర్కొన్నారు. పెట్రోల్ రోజువారి సాధారణ సగటు 6,920 కిలోలీటర్లుగా ఉండగా, నిన్న ఒక్కరోజే 12,875 కిలోలీటర్లు సరఫరా జరిగిందని తెలిపారు. డీజిల్ సాధారణ సగటు 9,017 కిలోలీటర్లు కాగా, నిన్న 21,295 కిలోలీటర్ల పంపిణీ జరిగినట్లు వెల్లడించారు.

డిమాండ్‌కు మించి సరఫరా జరుగుతోందని కిషన్ రెడ్డి వెల్లడించారు. అందుకే సామాజిక మాధ్యమాల్లో వచ్చే అసత్య ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. పుకార్లు నమ్మి పెట్రోల్ బంకుల వద్దకు వచ్చి అనవసరంగా క్యూ కట్టవద్దని పేర్కొన్నారు. అవసరానికి మించి ఇంధనాన్ని నిల్వ చేసుకోవద్దని ప్రజలకు కిషన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు

## బీసీ సంక్షేమ శాఖ అభివృద్ధి సలహాదారుగా వీహెచ్ నియామకం

**హైదరాబాద్,: ఏప్రిల్ 30(ప్రజావినికిడి):**

రాష్ట్ర మంత్రి సమాన హోదాలో ఈ పదవిలో వీహెచ్ నియామకం

కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి. హనుమంతరావు (వీహెచ్)కు తెలంగాణ ప్రభుత్వం సముచిత స్థానం కల్పించింది. బీసీ వర్గాల గళంగా గుర్తింపు పొందిన ఆయనను రాష్ట్ర ప్రభుత్వ బీసీ సంక్షేమ శాఖ అభివృద్ధి సలహాదారుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.వి. హనుమంతరావు గారిని రాష్ట్ర మంత్రి హోదాతో ఈ పదవిలో నియమించారు. దీని ప్రకారం ఆయనకు నెలకు రూ. 1,00,000 వేతనం అందనుంది. ఒకవేళ ప్రభుత్వ నివాసం కేటాయించకపోతే రూ. 50,000 ఇంటి అద్దె భత్యం (ఎ=రా) పొందే అవకాశం ఉంటుంది. ప్రయాణ ఖర్చుల కోసం రూ. 30,000 కన్వేయన్స్ అలవెన్స్, రూ. 15,000 ఇంధన ఖర్చులతో పాటు డ్రైవర్‌తో కూడిన ప్రభుత్వ వాహనాన్ని కూడా ప్రభుత్వం సమకూరుస్తోంది. వైద్య ఖర్చుల విషయంలో కూడా ఆయనకు అఖిల భారత సర్వీసు అధికారులు, మంత్రులతో సమానమైన రీయింబర్స్‌మెంట్ సౌకర్యం కల్పించారు.ఆయన కార్యకలాపాల కోసం బీసీ సంక్షేమ శాఖ ఒక ప్రైవేట్ సెక్రటరీ (పీఎస్), డేటా ఎంట్రీ ఆపరేటర్, ఆఫీస్ సబార్డినేట్లు, డ్రైవర్‌తో కూడిన ప్రత్యేక సిబ్బందిని కేటాయించింది. దశాబ్దాలుగా బీసీ హక్కుల కోసం పోరాడుతున్న హనుమంతరావు అపారమైన అనుభవం... ప్రభుత్వం అమలు చేయబోయే సంక్షేమ పథకాలకు దిశానిర్దేశం చేయడంలో కీలకం కానుంది. ముఖ్యంగా వెనుకబడిన తరగతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల్లో ఆయన సలహాలు ఇప్పుడు అధికారిక ముద్ర వేయనున్నాయి.

# కెరీర్ బిల్డింగ్ లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి**

అందిపుచ్చుకోవాలన్నారు. ఈ దిశలో పాఠశాల, ఇంటర్, ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధిపై విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చేలా వివిధ కోర్సులు రూపొందించాలని ఆదేశించారు. దీని కోసం ఐఐటీ చెన్నై సహా వివిధ ప్రతిష్ఠాత్మక సంస్థల నుంచి సిఫార్సులు తీసుకుని విద్యాశాఖలో అమలు చేయాలని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయాలు పరిశోధనలు, ఆవిష్కరణలకు కేంద్రాలుగా మారాలని పేర్కొన్నారు. గేమ్ చేంజర్‌లుగా మారనున్న లాజిస్టిక్స్, గ్రీన్ ఎనర్జీ లాంటి రంగాల్లోనూ కొత్త కోర్సులు తీసుకురావాలని చెప్పారు. డిమాండ్‌కు అనుగుణంగా ఈ కోర్సులు రావాల్సిన అవసరముందన్నారు. క్వాంటం టెక్నాలజీపై రాష్ట్రంలో మొట్ట మొదటగా కోర్సును ప్రారంభించటంపై ఆంధ్రా యూనివర్సిటీని ఆయన అభినందించారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు అంతర్జాతీయంగా పోటీ పడాలని, దీనికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రతీ యూనివర్సిటీకి ఏదో ఒక పారిశ్రామిక సంస్థతో అనుసంధానమై ఉండేలా చూడాలని సూచించారు. యూనివర్సిటీల్లో జర్మన్ సహా వివిధ విదేశీ భాషల్లో శిక్షణ కోసం ఓ విభాగం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. యూనివర్సిటీ రికార్డులను కూడా ఆన్‌లైన్ చేయాలని సూచించారు. త్వరలో రాష్ట్రంలో వివిధ ప్రతిష్ఠాత్మక సంస్థలు లాజిస్టిక్స్, ఏవియేషన్, హార్టికల్చర్ యూనివర్సిటీలను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చాయని సీఎం తెలిపారు.

**త్వరలో స్టూడెంట్స్ ఇన్నోవేషన్ కాంక్లేవ్**

విద్యార్థులకు కొత్త ఆలోచనలు వచ్చేలా వారితో ఓ ఏఐ కాన్ఫరెన్సు నిర్వహించాలని ముఖ్యమంత్రి చెప్పారు. దానికి స్టూడెంట్స్ ఇన్నోవేషన్ కాంక్లేవ్ గా పేరు పెట్టాలని సూచించారు. విద్యార్థులకు అన్ని పోషకాలూ అందేలా మధ్యాహ్న భోజన మెనూను రూపొందించాలని సూచించారు. మానసిక, భౌతిక ఎదుగుదలకు అనుగుణంగా ఆహారం అందేలా చూడాలని స్పష్టం చేశారు. హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో కిచెన్ గార్డెన్లను అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. లీప్ యాప్ ద్వారా తల్లితండ్రులు కూడా విద్యార్థుల హాజరు, వారి పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లోనూ సాంకేతికతతో కూడిన ఉత్తమ విద్యను అందించాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఆటిజం సహా దివ్యాంగ విద్యార్థులకు విద్యాబోధనలో ఎలాంటి ఆటంకాలు లేకుండా శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. క్రీడలతో పాటు మానసికోల్లాసానికి కో-కరిక్యులర్ యాక్టివిటీస్ ను పెంచాలని తెలిపారు. ఇంటర్ లో విద్యార్థులకు వివిధ కాంబినేషన్లలో కోర్సులు అందుబాటులో ఉండేలా చూడాలని, దీనిపై అధ్యాపకులకు కూడా రీఓరియంటేషన్ నిర్వహించాలని సూచించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా కోర్సులను రీస్ట్రక్చర్ చేస్తున్నట్లు వెల్లడించారు. వన్ క్లాస్ వన్ టీచర్ పాఠశాలలను పెంచేలా చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రస్తుతం పాఠశాలల్లో ఎన్ రోల్ మెంట్ ను కూడా పెంచుతున్నట్లు తెలిపారు. ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య వరకూ పాఠ్యాంశాలను మార్పు చేయటంతో పాటు బ్రిడ్జి కోర్సులు కూడా విద్యార్థులకు అందిస్తున్నామని తెలియచేశారు.ఈ సమీక్షలో విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, ఇంటర్మీడియట్ కమిషనర్ పి రంజిత్ భాషా, పాఠశాల విద్య కమిషనర్ తమీర్ అన్సారియా, కళాశాల విద్య కమిషనర్ భరత్ గుప్తా, స్కిల్ డెవలప్మెంట్ ఎండి గణేష్, సమగ్ర శిక్ష డైరెక్టర్ బి శ్రీనివాస్, ఉన్నత విద్యామండలి చైర్మన్ మధుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# కార్మికవర్గ స్ఫూర్తితో ముందుకెళ్తున్నాం

**మొదటిపేజీ తరువాయి**



విద్యార్థులకు అవసరమైన సామగ్రిని సకాలంలో అందేలా చూడాలని ఆదేశించారు. దుస్తులు, నోటు పుస్తకాలు, ఇతర సామగ్రి సకాలంలో అందితే విద్యార్థులు చదువుపై పూర్తి స్థాయిలో శ్రద్ధ చూపుతారని తెలిపారు. విద్యాశాఖతో పాటు బీసీ, మైనారిటీ, గిరిజన సంక్షేమ శాఖలు, ఎస్సీ డెవలప్‌మెంట్ శాఖల పరిధిలోని విద్యా సంస్థల్లోగల విద్యార్థులకు అందజేసే సామగ్రి సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్‌పై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గురువారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో దుస్తులు, నోటు పుస్తకాలు, ట్రంక్ పెట్టెలు, ఇతర సామగ్రి సరఫరాకు సంబంధించి ఏ శాఖకు ఆ శాఖ ప్రొక్యూర్‌మెంట్, సరఫరా చేపట్టడంతో అవకతవకలకు ఆస్కారం ఉండేదన్నారు. వాటిని అరికట్టేందుకు సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానాన్ని తీసుకువచ్చామని సీఎం తెలిపారు. అటువంటి అవకతవకలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని స్పష్టం చేశారు. విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందనీ, సరఫరాదారుల ప్రయోజనాలు కాపాడేందుకు కాదన్నారు. విద్యార్థులకు అందజేసే నోటు పుస్తకాలు, ట్రంక్ పెట్టెలు, ప్లేట్లు, గ్లాసులు, ట్రాక్ షూట్లు, బెడ్ షీట్లు, స్కూల్ బ్యాగులు, ఐడీ కార్డులు, యూనిఫాంలు అన్నీ నాణ్యమైనవే ఉండాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. నాణ్యతతో పాటు సకాలంలో అందడంపైనా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. జూన్ 15 నాటికి విద్యార్థులకు అవసరమైన సామగ్రి అందాలనీ, ఆ వెంటనే సరఫరాదారులకు చెల్లింపులు పూర్తి చేస్తామని సీఎం తెలిపారు.

విద్యార్థులకు అందజేసే వస్తువులకు సంబంధించి మండల స్థాయిలో ఒక నోడల్ అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. అక్కడి నుంచి క్షేత్ర స్థాయిలో గ్రామాల్లోని పాఠశాలలు, హాస్టళ్లకు వస్తువుల సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలనీ, సరఫరాకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు తీయించాలని అన్నారు. అదే విధంగా ప్రతి విద్యార్థికి అవసరమైన సామగ్రి అందిందా లేదా చెక్ చేసుకోవాలని ఆయన ఆదేశించారు. నోటు పుస్తకాలు, యూనిఫాం, ఇతర సామగ్రిని అందుకున్న తర్వాత వారి భావాలను తెలియజేసేందుకు విద్యార్థుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని అధికారులకు సీఎం సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, విద్యాశాఖల మధ్య సమన్వయానికి ఒక కమిటీని నియమించాలని ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి షఫీఉల్లా, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాల మాయాదేవి, సెర్ప్ సీఈవో దివ్య, ఉన్నత విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి సంతోష్, టీజీబీసీడబ్ల్యూఆర్ఐఈఎస్ కార్యదర్శి బి.సైదులు తదితరులు పాల్గొన్నారు.

# కాలానికి అనుగుణంగా చట్టాలు

**మొదటిపేజీ తరువాయి**

సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చీలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. ఈ సందర్భంగా ఎయిమ్స్ తరపున అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్జీ) ఐశ్వర్యభాటి వాదనలు వినిపించారు. ప్రస్తుతం బాధిత బాలిక గర్భం కొనసాగించడం ఆమెతో పాటు పుట్టబోయే బిడ్డకు మంచిదని నివేదించారు. ఈ అభ్యర్థనపై అభ్యంతరాలను వ్యక్తం చేసిన ధర్మాసనం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. ఆ బిడ్డపై నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వానిది లేదా వైద్య సంస్థలది కాకుండాడ బాధిత బాలిక, ఆమె తల్లిదండ్రులదై ఉండాలని వ్యాఖ్యానించింది. 'దయచేసి మీ(కేంద్ర ప్రభుత్వాన్ని) చట్టాన్ని సవరించండి. లైంగికదాడి కారణంగా గర్భం దాల్చినప్పుడు కాలపరిమితి ఉండకూడదు. మారుతున్న కాలానికి అనుగుణంగా చట్టం ఉండాలి' అని పేర్కొంది.

ఆ ఘటన బాధితురాలికి మాయని మచ్చ:సీజేఐ

ఎయిమ్స్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం పలు అంశాలను ప్రస్తావించింది. 'ఇది బాలికపై లైంగికదాడి కేసు. ఇది బాధితురాలికి జీవితాంతం మచ్చ. మానసిక క్షోభ మిగులుస్తుంది. బాధితురాలు తల్లి కావాలి. కానీ ఆ బాధను అనుభవించిన తల్లిని కాకుండా బిడ్డ(కడుపులోని పిండం)పైనే ఎక్కువ దృష్టి పెడుతున్నారు' అని సీజేఐ వ్యాఖ్యానించారు. దీంతో ఆ బాలిక ఆరోగ్యంపై శాశ్వత ప్రభావం లేకపోతే గర్భవిచ్ఛిత్తిని నిర్వహించడం, ఆమె ఆరోగ్య సమస్యల విషయంలో నిపుణులతో బాధితురాలికి, ఆమె తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇవ్వాలని జస్టిస్ బాగ్చి వ్యాఖ్యానించారు. ఆ తర్వాత బాలిక, ఆమె తల్లిదండ్రులు తీసుకునే నిర్ణయాన్నే కోర్టు పరిగణనలోకి తీసుకుంటుందని స్పష్టం చేశారు.

గర్భాన్ని కొనసాగించడమే బిడ్డ శ్రేయస్సుకు మేలు : ఎయిమ్స్

లైంగికదాడి కారణంగా ఓ బాలిక గర్భం దాల్చగా ఆ కేసులో ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా గర్భాన్ని మోయమని బలవంతం చేయలేమని సుప్రీంకోర్టు ధర్మాసనం గత విచారణలో వ్యాఖ్యానించింది. 20 వారాల(ఏడు నెలల) గర్భాన్ని తొలగించుకోవడానికి కోర్టు అనుమతిచ్చింది. ఈ ఆదేశాలను పున: సమీక్షించాలని ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) క్యూరేటివ్ పిటిషన్ దాఖలు చేసింది. ఏడు నెలల గర్భాన్ని తొలగిస్తే తీవ్రమైన వైకల్యాలతో శిశువు జన్మించే అవకాశం ఉందని అందులో ప్రస్తావించింది.

# దేశానికే ఆదర్శం తెలంగాణలో అక్రిడిటేషన్ల జారీ..

**మొదటిపేజీ తరువాయి**



గురువారం నాడు సమాచార శాఖ ఆధ్వర్యాన జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్ కార్డులను మంత్రిగారు అందజేశారు.ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ,గత ప్రభుత్వం ఇచ్చిన అక్రిడిటేషన్ కార్డులను ఇంతవరకు పొడిగించామని, దేశంలో,ఇతర రాష్ట్రాలలో అమలు చేస్తున్న ఉత్తమ విధానాలను ఇక్కడ అనుసరించాలన్న ఆలోచన మేరకు పరిశీలన సాగిందని అందువల్లే ఈ కార్డుల జారీలో ఆలస్యం చోటుచేసుకుందన్నారు.గత ప్రభుత్వం 32,500 మందికి అక్రిడిటేషన్లు ఇచ్చే అవకాశం ఉన్నా 23,352 కే పరిమితం చేసిందన్నారు. తమ ప్రభుత్వం ఇప్పుడు సుమారు 46 వేల మందికి పైగా అక్రిడిటేషన్లు ఇచ్చేలా మార్పులు చేసిందని తెలిపారు. ఇప్పటికే సుమారు 2800 వరకు కార్డులను ఆమోదించడం జరిగిందని వివరించారు.

జర్నలిస్టుల సూచనల మేరకు జీవోలలో మార్పులు చేర్పులు చేశామని, అర్హులైన జర్నలిస్టులకు కార్డుల మంజూరులో వెనకడుగు ప్రసక్తే లేదని అన్నారు. మే 1వ తేదీన అన్ని జిల్లాల్లో అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ చేయాలంటూ కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేస్తామని మంత్రి పొంగులేటి ప్రకటించారు. ఈ ప్రక్రియలో మే 10 వతేదీని ఒక కటాఫ్ డేట్‌గా పెట్టుకొని దరఖాస్తులు చేసుకోవాలని,ఆ తేదీలోగా వచ్చే దరఖాస్తులను ఆమోదించడం జరుగుతుందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో అక్రిడిటేషన్ల సంఖ్య తేలితే జర్నలిస్టులకు ఆరోగ్యం ఇతర సౌకర్యాలు కల్పించేందుకు ఒక ప్రణాళిక రూపొందించుకోవచ్చునని అన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ దిశగా పలు సూచనలు చేశారని వెల్లడించారు.

అంతేగాక జర్నలిస్టులు వివిధ సంస్థలలో ఉద్యోగాలు మారినప్పటికీ అక్రిడిటేషన్ల మంజూరు ఓ నిరంతర ప్రక్రియగా సాగుతుందని ఈ విషయంలో ఎటువంటి సందేహాలు వద్దని అన్నారు.దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తామని త్వరలో పాత్రికేయ సంఘాలతో భేటీ అవుతామని తెలిపారు.

ఏప్రిల్ 30తో కొంతమంది జర్నలిస్టుల బస్సుపాస్‌ల గడువు ముగుస్తున్నందున మరో 15 రోజుల పాటు పొడిగించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి పొంగులేటి ప్రకటించారు.ఈ సందర్భంగా పలువురు పాత్రికేయులకు అక్రిడిటేషన్ కార్డులను అందజేసి అభినందించారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక
శుక్రవారం 1 మే 2026

# చింతల్ త్రివేణి విజయ దుందుభి

## పదిలో ప్రభంజనం



**ప్రజావినికిడి, (చింతల్):**
పదో తరగతి ఫలితాల్లో చింతల్ త్రివేణి విద్యా సంస్థల విద్యార్థులు విజయ దుందుభిని మోగించారు. విద్యార్థుల నిరంతర కృషి, ఉపాధ్యాయుల నిబద్ధత, క్రమశిక్షణతో కూడిన బోధన వెరసి త్రివేణి కీర్తి కిరీటంలో మరో స్వర్ణ కేతనం ఎగుర వేశారు.టాప్ విద్యార్థులు చరణ్ తామిరి 581/600, నిత్యశ్రీ మాదంశెట్టి 581/600,రూప శ్రీ లక్ష్మి నాగ సాయి బుసం 580/600, శ్రావణి పి 578/600,వినీత్ రెడ్డి ఎద్దండి 577/600,గీతిక బిట్ల 576/600, తేజేశ్వర్ కంటే 576/600,చైతన్య కిశోర్ బల్లి 575/600,గణేష్ సాయి సాత్విక్ యలక 572/600 నిలిచారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శివ కీర్తన మాట్లాడుతూ విద్యార్థుల విజయంపై హర్షం వ్యక్తం చేశారు. ఇది విద్యార్థుల అంకితభావానికి దక్కిన ప్రతిఫలమన్నారు. పాఠశాల ప్రాంగణంలో టపాసులు పేల్చి అంబరాన్నంటిన సంబురాలు జరుపుకుని మిఠాయిలు తినిపించకుకున్నారు.విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపల్ శివ కీర్తనతో పాటు సిఆర్ఓ వెంకటరావు, సిఎస్ఓ సుబ్బారావు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఐ&పిఆర్ కమీషనర్ తో తెలంగాణ జర్నలిస్ట్ సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ జేఏసీ..



**హైదరాబాద్,(ప్రజావినికిడి):**
తెలంగాణ సమాచార,పౌర సంబంధాల (ఐ&పిఆర్) శాఖకు కొత్త ప్రత్యేక కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ముకుంద రెడ్డి ను గురువారం ఏప్రిల్ 30,2026,మర్యాదపూర్వకంగా కలిసిన తెలంగాణ జర్నలిస్ట్ సంఘాల ఐక్య కార్యాచరణ కమిటి జేఏసీ కన్వినర్లు కే. కోటేశ్వరరావు, అనంచిన్ని వెంకటేశ్వరరావు,కో కన్వినర్లు నర్సింహా చారి, పురుషోత్తం,బాపట్ల కృష్ణమోహన్, వెంకటేశ్వర్లు,ఐ వ్యా కిషోర్, బాలకృష్ణ తుమ్మల తదితరులు.ఈ సందర్భంగా తెలంగాణ జర్నలిస్టుల జేఏసీ కన్వినర్లు కమీషనర్ తో మాట్లాడుతూ, అక్రిడిటేషన్ కార్డులు అర్హత కలిగిన వారికి తప్పకుండా అందచేయాలని, కేబుల్ టీవీ జర్నలిస్టులకు కూడా అక్రిడిటేషన్ ఇవ్వాలని అన్నారు. కమిషనర్ స్పందిస్తూ జర్నలిస్టుల అక్రిడిటేషన్ ప్రక్రియ నిరంతరం ఉంటుంది అని, అర్హత కలిగిన జర్నలిస్టులు అందరికి న్యాయం చేస్తాము అన్నారు.

# దాదాపు 110 క్వింటల్లా రేషన్ బియ్యం స్వాధీనం..

## డి.ఎస్.పి వెంకటేశం ఆధ్వర్యంలో దాడులు..

## అక్రమరేషన్ బియ్యం రవాణాపై ఉక్కు పాదం మోపుతున్న డిఎస్పి వెంకటేశం..






**హైదరాబాద్,(ప్రజావినికిడి):**
పెద్ద గోల్కొండ ప్రాంతంలో అక్రమ రేషన్ బియ్యం దందాపై సివిల్ సప్లై టాస్క్ ఫోర్స్ అధికారులు మరోసారి మెరుపు దాడులు నిర్వహించారు. టాస్క్ ఫోర్స్ టీం2 డి.ఎస్.పి వెంకటేశం ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆపరేషన్‌లో సుమారు 110 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల ఇదే ప్రాంతంలో అక్రమ రవాణా కొనసాగుతున్నట్లు వచ్చిన పక్కా సమాచారంతో అధికారులు పర్యవేక్షణను పెంచి,కచ్చితమైన ప్రణాళికతో దాడులు చేపట్టినట్లు డిఎస్పి వెంకటేశం వెల్లడించారు.గతంలో కూడా ఏప్రిల్ 18,23 తేదీలలో రెండుసార్లు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేసినప్పటికీ, అక్రమ రవాణాదారులు తమ కార్యకలాపాలను ఆపకుండా కొనసాగించడం గమనార్హం.ఈసారి నిర్వహించిన దాడుల్లో డీసీఎం ఐచర్ వాహనం (ఏపీ 28 టిసి 0286),మహీంద్రా మినీ ట్రక్ (టీఎస్ 05 యుసి 5645)లను అధికారులు సీజ్ చేశారు.ఈ వాహనాల ద్వారా రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు అధికారులు నిర్ధారించారు. దాడుల్లో పాల్గొన్న ఇన్స్పెక్టర్ పాండరి, ఎస్సై వెంకటేశ్వర్లు, ఎస్సై సాంబశివరావు, డీటీసీఎస్ రామకృష్ణ తదితరులు సమన్వయంతో చర్యలు చేపట్టి, నిందితులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ వెంకటేశం మాట్లాడుతూ పేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా దారి మళ్లించడం తీవ్రమైన నేరమని హెచ్చరించారు. ఇటీవల కొన్ని పత్రికలలో వస్తున్న కథనాలనుపై స్పందించడం జరుగుతుందని ఇలాంటి దందాలను పూర్తిగా అరికట్టేందుకు నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.
స్థానికంగా కొనసాగుతున్న ఈ అక్రమ రవాణాపై ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే సమాచారాన్ని అధికారులకు అందించాలని కోరారు.తరచూ దాడులు జరుగుతున్నప్పటికీ అక్రమ రేషన్ మాఫియా దందా ఆగకపోవడం అధికార యంత్రాంగానికి సవాల్‌గా మారింది. దీనిపై సివిల్ సప్లై కమిషనర్ స్పందించి మరింత కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అయితే టాస్క్ ఫోర్స్ టీం లు 5 ఉన్న కేవలం టీం2 అధికారులే నిత్యం దాడులు చేసి రేషన్ బియ్యం అక్రమ రవాణా పై ఉక్కు పాదం మోపుతున్నారు. అయితే మిగతా సివిల్ సప్లై టాస్క్ ఫోర్స్ టీం లకు సంబంధించిన అధికారులు, స్థానిక పోలీసులు దాడులు జరాపకపోవడం వెనుక ఆర్థిక లావాదేవీల ఒప్పందాలు ఉన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

# కన్నుల పండువగా శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కళ్యాణం

## భారీగా తరలివచ్చిన భక్తులు

**ఎల్బీనగర్, (ప్రజావినికిడి):**
పెద్ద అంబర్‌పేటలోని కేసరిగుట్టలో వేంచేసి ఉన్న శ్రీ స్వయంభూ హనుమాన్ సమేత లక్ష్మీనరసింహ స్వామి వారి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి.పెద్ద అంబర్‌పేట దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామి వారి కళ్యాణోత్సవం కన్నుల పండువగా, ఘనంగా నిర్వహించారు.
ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.అనంతరం స్వామివారికి పంచామృతాభిషేకం,ప్రత్యేక అలంకరణ, అష్టోత్తర శతనామావళి పూజ,కర్పూర హారతి,విశ్వక్సేన



పూజ,వాసుదేవా, పుణ్యహావాచన కలశ స్థాపన,దీక్ష కంకణ ధారణ క్రతువులు శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం ప్రధాన ఘట్టమైన “శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి కళ్యాణాన్ని“ వేదమంత్రోచ్ఛారణల మధ్య వేడుకగా నిర్వహించారు. కళ్యాణం అనంతరం భక్తులందరికీ భారీ ఎత్తున అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు.ఈ పవిత్రమైన ఉత్సవాల్లో స్థానిక ప్రజలు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. కేవలం స్థానికులే కాకుండా, చుట్టుపక్కల ఇతర గ్రామాల నుంచి కూడా భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తరించారు.ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి పలువురు తాజా, మాజీ కౌన్సిలర్లు, ఇతర స్థానిక ప్రజాప్రతినిధులు హాజరై స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా పెద్ద అంబర్‌పేట దేవాలయ కమిటీ పటిష్టమైన ఏర్పాట్లు చేసి ఉత్సవాలను విజయవంతం చేశారు.

# మే డే రోజున ఉపాధి హామీ కార్మికులకు సెలవు ప్రకటించాలి

## పెండింగ్ లో ఉన్న కార్మికులు డబ్బులు చెల్లించాలి... -వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్..

## పని ప్రదేశం లో మంచినీరు విశ్రాంతి టెంట్లు ఏర్పాట్లు చేయాలి.. సీపీఎం

**వాజేడు, (ప్రజావినికిడి):**
మే డే రోజున ప్రపంచ కార్మికుల దినోత్సవం పురస్కరించుకొని మే 1 తారీఖున వాజేడు మండలంలో ఉపాధి హామీలో పనిచేసే కార్మికులందరికీ సెలవు దినంగా ప్రకటించాలని కోరుతూ,సిపిఎం పార్టీ వాజేడు మండల కమిటీ,వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండల భివృద్ధి అధికారికి వినతి పత్రం అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి కొప్పుల రఘుపతి మాట్లాడుతూ,మే డే రోజున ప్రపంచవ్యాప్తంగా కార్మికుల హక్కులు,పని గంటలు సాదించుకున్న దినం పురస్కరించుకొని ప్రపంచం వ్యాప్తంగా కార్మికులు ఘనంగా మేడే ఉత్సవాలు జరుపుకుంటారని, మే 1న ఉపాధి కార్మికులకు పని కల్పించడం సరైంది కాదని మే డే కార్మికుల దినోత్సవం కు విరుద్ధం అని వారు అన్నారు.దానివలన ప్రపంచ కార్మిక దినోత్సవం యొక్క ప్రాధాన్యత తగ్గుతుందని వారు మాట్లాడుతూ అన్నారు. అందువలన మే డే కు కార్మికులకు సెలవు ప్రకటించాలని డిమాండ్ చేశారు .
ఉపాధి పని ప్రదేశాలలో త్రాగునీరు, విశ్రాంతి తీసుకొనుటకు టెంట్లు ఏర్పాటు చేయాలి.



ఉపాధి హామీ పని జరిగే ప్రదేశాలలో సరైన వసతులు లేని కారణం గా తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ,ఉపాధి కూలీలు ఎండ తీవ్రతకు ఇబ్బందులు పడకుండా మంచినీరు, టెంట్,ఫస్ట్ ఎయిడ్ కిట్టు ఇతర వసతులు ఏర్పాట్లు చేయాలని కోరారు మండలం లో ఏ పని ప్రదేశం లో కూడా ఏర్పాట్లు చేయటం లేదని మా సందర్శన లో మా దృష్టి కి కార్మికులు తీసుకు వచ్చారని ఎండ తీవ్రత దృష్టి లో ఉంచుకొని ఏర్పాట్లు చేయాలని వారు డిమాండ్ చేశారు పెండింగ్ లో ఉన్న ఉపాధి బిల్లులు కూడా మంజూరు చేయాలి కొన్ని నెలలు గా పెండింగ్ లో ఉండటం వలన కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని వారు మాట్లాడుతూ, అన్నారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు దామోదర్,బచ్చల కృష్ణ బాబు,నరేష్,మహేందర్ పాల్గొన్నారు.

# బట్టి విక్రమార్క తోకలిసిన డైరెక్టర్ బ్రిగేడియర్ యన్.ఆర్.బాబు

**హైదరాబాద్, (ప్రజావినికిడి):**
తెలంగాణా సైనిక సంక్షేమ శాఖ నూతనంగా నియమించబడిన డైరెక్టర్ బ్రిగేడియర్ యన్.ఆర్.బాబు, మాజీ సైనికుల రావలసిన ఆర్థిక పరమైన అంశాల గురించి మొదటిసారిగా గౌరవ ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క తో వారి క్యాంపు కార్యాలయములో కలిసి వారికి పూల గుత్యాన్ని అందించి వారి తో మాట్లాడటం జరిగింది.ఈ సందర్భంగా తెలంగాణా సైనిక సంక్షేమ శాఖ డైరెక్టర్ వారు రెండవ



ప్రపంచ యుద్ధములో పనిచేసిన వారికి ఆర్థిక సహాయం కొన్ని బకాయిలు ఉన్నాయని వాటిని వెంటనే విడుదల చేయాలని, యుద్ధవితంతువులకు మరియు గ్యాలంటరి అవార్డు సాధించిన వారికి ఇవ్వాల్సిన పారితోషికం త్వరగా ఇంపించాలని వారి దృష్టికి తేవడం జరిగింది.గౌరవ ఉపయోగం ముఖ్యమంత్రి వర్యులు వెంటనే స్పందించి వెంటనే వాటికి నిధులు విడుదల చేయాలని ఆదేశించారు. అదేవిదంగా జిల్లా కార్యాలయాలకు రావలసిన బకాయిలను విడుదల చేయాలని కోరిన్నారు దానికి కూడా ఉప ముఖ్యమంత్రి వర్యులు వెంటనే సానుకూలంగా స్పందించిన్నారు.మాజీసైనిక కార్పొరేషన్ తెలంగాణా లో ఏర్పాటు చేయుటకు సహకరించాలని కోరిన్నారు.అలాగే తెలంగాణా సైనిక సంక్షేమ శాఖ లోని అధికారుల కాళీలను భర్తీ చేయుటకు ఫైనాన్స్ అనుమతి ఇప్పించాలని కోరిన్నారు. ఆర్థిక పరమైన అన్ని విషయాలలో గౌరవ ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి చర్యలు చేపడతమని చెప్పినందుకు వారికి ధన్యవాదములు తెలిపినారు.ఈ సమావేశంలో లో రంగారెడ్డి, హైదరాబాద్ ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి శ్రీనేష్ కుమార్ నోరి కూడా పాల్గొన్నారు.

# లోన్ మాయలో లక్షా పాతిక వేల దోపిడి..

## నాగోల్‌లో సైబర్ మోసం..

**నాగోల్,(ప్రజావినికిడి):**
తక్కువ వడ్డీతో లోన్ ఇప్పిస్తామంటూ మాయమాటలు చెప్పి ఒక ఉపాధ్యాయుడిని లక్షా పాతిక వేల రూపాయలతో మోసం చేసిన ఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. రోజురోజుకు పెరుగుతున్న సైబర్ మోసాల నేపథ్యంలో ఈ ఘటన మరోసారి ప్రజలను అప్రమత్తం చేస్తోంది.
పోలీసుల కథనం ప్రకారండనాగోల్ సాయినగర్ కాలనీకి చెందిన కొప్పుల లింగ రెడ్డి (46), ఉపాధ్యాయుడు, ఈ నెల 2వ తేదీన ఉదయం ఒక అనామక కాల్ అందుకున్నారు. కాల్ చేసిన వ్యక్తి తాను ఐసిఐసిఐ బ్యాంక్ నానక్రామ్ గూడ బ్రాంచ్ నుండి మాట్లాడుతున్నానని చెప్పి,తక్కువ వడ్డీతో పెద్ద మొత్తంలో లోన్ అందిస్తానని హామీ ఇచ్చాడు.ఇప్పటికే ఇతర బ్యాంకుల్లో ఖాతాలు ఉన్నాయని, లోన్ అవసరం లేదని



బాధితుడు చెప్పినప్పటికీ, ప్రస్తుత లోన్లను క్లోజ్ చేసి మరింత తక్కువ వడ్డీతో కొత్త లోన్ ఇప్పిస్తానని నమ్మబలికాడు.
తనను “ప్రదీప్”గా పరిచయం చేసుకున్న ఆ మోసగాడు, బాధితుడి సిబిల్ స్కోర్ తక్కువగా ఉందని పేర్కొంటూ, ప్రాసెసింగ్ ఛార్జీలు, డాక్యుమెంట్ ఫీజుల పేరుతో రూ.1,25,000 చెల్లించాలని కోరాడు. నమ్మకంగా మాట్లాడటం, బ్యాంక్ ఉద్యోగి లాగా ప్రవర్తించడం వల్ల బాధితుడు అతని మాటలను నమ్మి, తన వ్యక్తిగత వివరాలను వాట్సాప్ ద్వారా పంపించాడు.
ఆ తర్వాత మోసగాడి సూచనల మేరకు మూడు విడతలుగా డబ్బులు బదిలీ చేశాడు.ఏప్రిల్ 7న తన భార్య ఖాతా నుండి రూ.50,000, ఏప్రిల్ 14న మరో రూ.50,000, ఏప్రిల్ 28న తన ఖాతా నుండి రూ.25,000 ఫోన్‌పే ద్వారా ట్రాన్స్‌ఫర్ చేశారు. మొత్తం డబ్బు అందుకున్న తర్వాత మోసగాడు ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి, వాట్సాప్ నంబర్ కూడా అందుబాటులో లేకుండా పోయింది.దీంతో మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు నమోదు చేయించుకున్నారుఅనంతరం నాగోల్ పోలీస్ స్టేషన్‌లో అధికారిక ఫిర్యాదు ఇవ్వగా, పోలీసులు కేసు నమోదు చేశారు.
ఇన్స్పెక్టర్ మొహమ్మద్ మక్బూల్ జానీ మాట్లాడుతూ, నిందితుడిని గుర్తించేందుకు సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు కొనసాగిస్తున్నామని తెలిపారు. డబ్బులు వెళ్లిన ఖాతాల వివరాలు సేకరించి, సంబంధిత బ్యాంకులతో సమన్వయం జరుపుతున్నట్లు తెలిపారు.

# ఎల్ఆర్ఎస్ రాయితీ పథకం కేవలం మూడు నెలలకే పరిమితం

**హైదరాబాద్,(ప్రజావినికిడి):** తెలంగాణ రాష్ట్రంలో అనుమతి లేని మరియు అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ కోసం ఎదురుచూస్తున్న సామాన్య ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది.
పెండింగ్‌లో ఉన్న లేఅవుట్ల క్రమబద్ధీకరణను వేగవంతం చేసే ఉద్దేశంతో, ఎల్ఆర్ఎస్ ఫీజు మరియు ఇతర చార్జీలపై ఏకంగా 25 శాతం రాయితీని ప్రకటిస్తూ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర మున్సిపల్ పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ ఈ మేరకు జీఓ ఎంఎస్ నెం. 131ని విడుదల చేసింది. ఈ రాయితీ పథకం మే 1నుంచి జూలై 31 వరకు మూడు నెలల పాటు అందుబాటులో ఉంటుంది. ఈ గడువు లోపు తమ ఎల్ఆర్ఎస్ చార్జీలను చెల్లించే దరఖాస్తుదారులకు మాత్రమే ఈ 25 శాతం డిస్కౌంట్ వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ పక్రియను పూర్తి చేయడంలో ప్రజలకు ఆర్థిక వెసులుబాటు కల్పించడం. రాయితీ ప్రకటించడం ద్వారా ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ ప్లాట్లను/లేఅవుట్లను రెగ్యులరైజ్ చేసుకుంటారని ప్రభుత్వం భావిస్తోంది.

## మల్కాజిగిరి జోన్ పరిధిలో

# జోరుగా అక్రమ నిర్మాణాలు..

**జోనల్ కమీషనర్ కి పిర్యాదు చేసిన ఫలితం శూన్యం.. -నిబంధనలు తుంగలో.. వాణిజ్య భవనం జోరుగా.!**

**రెసిడెన్షియల్ అనుమతులతో కమర్షియల్ నిర్మాణం.. - టౌన్ ప్లానింగ్ అధికారుల అంతర్గత ఒప్పందాలే కారణమా.?**







**హైదరాబాద్,(ప్రజావినికిడి):**
మల్కాజిగిరిమౌలాలి సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణం నిబంధనలు పాటించాల్సిన చోట అక్రమాలు రాజ్యమేలుతున్నాయి. సామాన్యుడు చిన్న ఇల్లు కట్టుకుంటే వంద నిబంధనలు చెప్పే టౌన్ ప్లానింగ్ అధికారులు, కళ్ళముందే భారీ ఉల్లంఘనలు జరుగుతున్నా పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మౌలాలి సర్కిల్ పరిధిలోని వినాయక నగర్ లో ప్రస్తుతం ఇదే పరిస్థితి నెలకొంది.
వినాయక నగర్ పరిధిలో ని లోని మూడు గుళ్ళ పక్కన ఉన్న 100 ఫీట్ల ప్రధాన రహదారిపై ఒక భారీ భవన నిర్మాణం జరుగుతోంది.నిబంధనల ప్రకారం ఇక్కడ నివాస గృహ అవసరాల కోసం అనుమతులు తీసుకున్నట్లు తెలుస్తోంది.కానీ, క్షేత్రస్థాయిలో మాత్రం సదరు యజమాని నిబంధనలకు విరుద్ధంగా ఏలాంటి సెట్ బ్యాక్ లు లేకుండా పూర్తిస్థాయి వాణిజ్య భవనాన్ని నిర్మిస్తున్నారు. ప్రధాన రహదారిపై ఇలాంటి నిర్మాణాలు చేపట్టడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నార.ఈ అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని గత మూడు నెలలు గా స్థానిక ప్రజలు పలుమార్లు టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేసిన చూసి చూడనట్లు వాహరిస్తున్నారని మండి పడ్తున్నారు.భవనం పునాది దశలో ఉన్నప్పుడే ఫిర్యాదులు చేసినప్పటికీ, అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో ప్రస్తుతము బిల్డింగ్ పూర్తి కావస్తుందని స్థానికులు ఆరోపిస్తున్నారు.ప్రధాన రహదారిపై ఇంత భారీ నిర్మాణం జరుగుతుంటే అధికారులకు కనిపించడం లేదా అని ప్రశ్నిస్తున్నారు.భవనం పూర్తయ్యే వరకు వేచి చూసి, ఆ తర్వాత తూతూమంత్రంగా చర్యలు తీసుకుంటారా అని స్థానికులు సూటిగా ప్రశ్నిస్తున్నారు.అధికారుల ఉదాసీనత చూస్తుంటే నిర్మాణదారులకు, అధికారులకు మధ్య భారీ స్థాయిలో అంతర్గత ఒప్పందాలు కుదిరాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మామూళ్ల మత్తులో పడి అధికారులు నిబంధనలను పక్కన పెట్టేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, వినాయక నగర్ 100 ఫీట్ల రోడ్డులో జరుగుతున్న ఈ అక్రమ నిర్మాణాన్ని పరిశీలించి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

# హజ్ ముబారక్..

**కాంగ్రెస్ నేత ఖాలేద్ భాయ్ కు శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు..**


**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితర నేతలు.. - జర్నలిస్ట్ కేపీ తదితర నాయకులు..**

**మైనార్టీ నేతలు సయ్యద్ సాదిక్, జమ్రుద్ ఖాన్, ఎండి ఖాదర్ గోరి, రషీద్ భాయ్, అక్రమ్ తదితరుల హాజరు..**









**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
ఫరూక్ నగర్ మాజీ సర్పంచ్ సీనియర్ కాంగ్రెస్ నేత ఖాలేద్ భాయ్ తదితర కుటుంబ సభ్యులు పవిత్ర యాత్రకు వెళ్తున్న సందర్భంగా పలువురు ప్రముఖులు వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఈడెన్ ప్లాజాలో జరిగిన వీడుకోలు కార్యక్రమానికి షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్,మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్ తదితరులు ఖాలేద్ భాయ్ కు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. హజ్ యాత్ర ఎంతో శుభాలు చేకూరాలని అంత మంచి జరగాలని సుఖ ప్రయాణం ఉండాలని ఎమ్మెల్యే అల్లాను ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా సీనియర్ జర్నలిస్ట్ ఎండి ఖాజాపాషా కేపి,మైనార్టీ నేతలు సయ్యద్ సాదిక్,జమ్రుద్ ఖాన్,ఖాదర్ గోరి, దర్గా రషీద్ భాయ్, అక్రమ్,అంజద్ బాబా,లయక్ పటేల్,షకీల్, మన్సూర్,రిపోర్టర్ మొయిజ్ తదితరుల హాజరు అయ్యారు.ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఘట్ కేసర్ రైల్వే బ్రిడ్జి కోసం ఆమరణ నిరాహారదీక్ష కు సిద్ధం

**: ఘట్ కేసర్ మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్**

**మే పదకొండున అన్నివర్గాల ప్రజలతో కలిసి ఆమరణ నిరాహారదీక్ష దీక్షకు దిగుతానన్న అబ్బసాని**



**ఘట్ కేసర్,(ప్రజావినికిడి):**
మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్ కేసర్ మండల కేంద్రంలో గత పదమూడు సంవత్సరాలుగా నత్త నడకన సాగుతున్న ఘట్ కేసర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి పూర్తయ్యేందుకు తాను ఆమరణ నిరాహారదీక్ష కు దిగుతున్నానని ఘట్ కేసర్ మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్ అన్నారు.ఈ మేరకు ఘట్ కేసర్ ఈడబ్లుఎస్ కాలనీ వివేకానంద విగ్రహం వద్ద స్థానికులతో కలిసి ఆమరణ నిరాహారదీక్ష కు సంబంధించిన కరపత్రాన్ని యాదగిరి యాదవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,
2014 లో ఘట్ కేసర్ మండల కేంద్రంలో కొండాపూర్ వెళ్లే మార్గంలో ప్రారంభించిన రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు కాంట్రాక్టర్లు,ఆర్ అండ్ బి అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో సాగదీతకు గురవడం దారుణమని అన్నారు.2022 లో బ్రిడ్జి పనుల కోసం మహధర్నా,రిలే నిరాహారదీక్షలు చేసినప్పుడు అప్పటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని అన్నారు. మూడేళ్లు గడుస్తున్నా రైల్వే బ్రిడ్జి నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వకుండా,బ్రిడ్జి పనులు పూర్తి చెయ్యకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని యాదగిరి యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు.వివిధ పనులు,స్కూళ్ళు, కాలేజీలకు వెళ్లేందుకు రైల్వే గేట్ దాటేందుకు మహిళలు, విద్యార్థులు, యువత తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.బ్రిడ్జి పనుల వేగవంతానికి మే పదకొండున స్థానిక జెఏసి,యువత, మహిళలు , విద్యార్థులతో సహకారంతో ఆమరణ నిరాహారదీక్ష కు దిగుతున్నాననీ , ఈ కార్యక్రమానికి అన్ని రంగాల వారు ముందుకు వచ్చి సహకరించాలని అబ్బసాని యాదగిరి యాదవ్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కేశవపట్నం ఆంజనేయులు పంతులు,మాజీ కౌన్సిలర్ బేతాళ నర్సింగ్ రావు, నాగభూషణం, మాజీ వార్డు సభ్యులు బర్ల దేవేందర్, కొత్తకొండ వెంకటేష్,దంతాల అనిల్,దంతూరి గోపాల్ గౌడ్, తన్నీరు రాంబాబు, రాజబోయిన రామచందర్ , రామకృష్ణ,సారా శ్రీనివాస్ గౌడ్, వెంకటాచారి,కె. శ్రీనివాస్,గురుదేవ్ తదితరులు పాల్గొన్నారు .

# బాల్య వివాహాలు అరికట్టాలి



**వాజేడు,(ప్రజావినికిడి):** గుమ్మడిదొడ్డి గ్రామంలో సఖి సెంటర్ కౌన్సిలర్ కల్పన ఆధ్వర్యంలో పదహారు సంవత్సరాల నుండి పద్దెనిమిది సంవత్సరాల మధ్య బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశంలో స్థానిక సర్పంచ్ బొడెబోయిన భరత్ కుమార్ మాట్లాడుతూ, చట్టపరంగా పద్దెనిమిది సంవత్సరాల నిండక ముందు వివాహాలు చేయడం వలన బాలికలకు ఆరోగ్య, విద్య,ఆర్థికంగా సమస్యల తలెత్తుతాయి,ఇది ఒక బాధ్యత రహితమైన హానికర సాంప్రదాయమని ఇది చట్ట రీత్యా నేరమని ఆయన వివరించారు, సమాజంలో ఎక్కడైనా బాల్య వివాహాలు జరిపితే వారిపై విచారణ చేపట్టి కేసులు నమోదు చేయించే అధికారం అందరికి ఉంటుందని ఆయన తెలిపారు.ఎవరైనా 18 సంవత్సరాల దాటక ముందు పెళ్ళిళ్ళు చేస్తున్నట్లు తెలిస్తే ఆశ వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, సెక్రటరీలకు ముందస్తు సమాచారం ఇచ్చినట్లుఐతే పై అధికారులుకు తెలియజేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటారని అవగాహన కల్పించారు. సమావేశంలో సఖి సెంటర్ కౌన్సిలర్ కల్పన,అంగన్వాడీ టీచర్ విజయ,ఆశ వర్కర్ మాలతి, వార్డుమెంబర్లు, గ్రామస్తులు, యువతీ యువకులు,తదితరులు పాల్గొన్నారు.

# వివేకానంద పార్కును సందర్శించి పరిశీలించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**
బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఎన్.జీ.ఓస్ కాలనీలో ఉన్న స్వామి వివేకానంద పార్క్ వాకర్స్ అసోసియేషన్ కమిటీ సభ్యుల విజ్ఞప్తి మేరకు గురువారం రోజు ఉదయం 05.45 నిమిషాలకు ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి వివేకానంద పార్కును సందర్శించారు.ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో కలిసి పార్కులో పర్యటించారు.
పార్క్ అభివృద్ధికి సంబంధించిన పలు సమస్యలను అసోసియేషన్ సభ్యులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా యోగ షెడ్ నిర్మాణం,అసోసియేషన్ భవనానికి రంగులు వేయడం,టాయిలెట్ల మరమ్మతులు మరియు మహిళల కోసం ప్రత్యేక టాయిలెట్లు,ఓవర్ హెడ్ ట్యాంక్ ఏర్పాటు,వాకింగ్ ట్రాక్ పునర్నిర్మాణం,ఓపెన్ జిమ్ పునర్నిర్మాణం,మంచినీటి సదుపాయం,నూతన బోర్ కనెక్షన్ కల్పించడం వంటి అంశాలను కోరారు.అదేవిధంగా పార్కులో చెత్త చెదారం పేరుకుపోవడం,కుక్కలు విపరీతంగా సంచరిస్తున్న సమస్యలను ప్రస్తావిస్తూ,కుక్కలు లోపలికి రాకుండా పార్క్ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.అలాగే పార్క్ బయట గోడలకు స్టిక్కర్లు అంటించకుండా చూడాలని కోరారు.ఈ సమస్యలపై స్పందించిన సుధీర్ రెడ్డి ,వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.అలాగే టాయిలెట్స్,పార్క్ ఫెన్సింగ్,వాకింగ్ ట్రాక్,నూతన బోర్ కనెక్షన్,తదితరపలు అంశాల మీద సంబంధించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు.అలాగే నూతన యోగ షెడ్డు నిర్మాణం కోసం కటిక రెడ్డి అరవింద్ రెడ్డి ముందుకు రావడం చాలా అభినందనీయమని అన్నారు.
ఈ కార్యక్రమంలో బి.ఎన్.రెడ్డి.నగర్ భారస పార్టీ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి,మాధవరం నరసింహారావు,మనోజ్,భాస్కర్,వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మంచిరెడ్డి వెంకట్ రెడ్డి,వర్కింగ్ ప్రెసిడెంట్ జైపాల్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి జగన్ రెడ్డి,ఉపాధ్యక్షులు మోహన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, నారాయణ, జాయింట్ సెక్రటరీ రవీందర్ రెడ్డి, రవిశంకర్, వీరాస్వామి, ఆర్గనైజింగ్ సెక్రటరీ రామకృష్ణారెడ్డి, రామ్ రెడ్డి, అడ్వైజర్స్ మధుసూదన్ రెడ్డి, కృష్ణారెడ్డి, కార్యవర్గ సభ్యులు జంగారెడ్డి, జంగయ్య, సుధాకర్ రెడ్డి, సభ్యులు తిరుమల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# ముగ్గురు పోలీస్ అధికారుల ఘన సన్మానం



**హైదరాబాద్,(ప్రజావినికిడి):**
గురువారం రోజు మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ లో పనిచేస్తున్న ముగ్గురు పోలీస్ అధికారులను మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సిపి ఆదేశాలతో సన్మానం చేయడం జరిగింది.
కె.కరుణాకర్ రెడ్డి, సబ్ ఇన్స్పెక్టర్, యాంటీ హ్యూమన్ ట్రాఫిక్, హెచ్.బండయ్య, సబ్ ఇన్స్పెక్టర్, సరూర్నగర్ పోలీస్ స్టేషన్,ఆర్మ్డ్ హెడ్ క్వార్టర్ లో పెనిచేస్తున్న బి.కిష్టయ్య,రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్ లు పదవి విరమణ పొందినారు. మల్కాజ్గిరి అడ్మిన్ డీసీపీ శివ కుమార్ మాట్లాడుతూ, పోలీసు ఉద్యోగం ఎన్నో సవాళ్లతో కూడుకున్నదని, విధి నిర్వహణలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ ఎంతో కాలం పాటు పోలీసుశాఖలో సమర్థవంతంగా, క్రమశిక్షణతో పనిచేసి తమ సేవలు అందించినందుకు అభినందించారు.ఈ కార్యక్రమంలో సిఎఒ అడ్మిన్ శ్రీనివాస్,చీఫ్ ఎకౌంట్స్ ఆఫీసర్ శ్రీనివాస్,అశోక్ రెడ్డి,అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు సిహెచ్.భద్రా రెడ్డి, కృష్ణా రెడ్డి,ఎస్టేట్ ఆఫీసర్ నాయుడు,కో ఆపరేటివ్ అకౌంట్స్ ఆఫీసర్ ప్రదీప్ కుమార్, బాలరాజు ట్రెజరర్, డైరెక్టర్స్ సువర్ణ, వల రాజు తదితరులు పాల్గొన్నారు.

# శ్రమదోపిడీని ప్రోత్సహిస్తున్న పాలకులు !

**ఏప్రిల్ 30(ప్రజావినికిడి):**
శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది ఏదీ లేదని మహాకవి శ్రీశ్రీ అన్నారు. కార్మిక లోకాన్ని తట్టి లేపిన విప్లవకారుడు శ్రీశ్రీ. అయితే దేశంలో ఐటి విప్లవం వచ్చిన తరవాత పాలకులు కార్మికులను పట్టించుకోవడం మానేశారు. నేటికీ వారి బతుకులు ఛిద్రం అవుతున్నా కనీసం పలకరింపులు, సానుభూతి వచనాలు లేవు. ఇప్పుడు కార్మికులంటే కేవలం కర్మాగారాల్లో పనిచేస్తున్నవారే కాదు. రోడ్డుమీద పడి పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ కార్మికులే. వారికి ముఖ్యంగా ఆరోగ్య, ఆర్థిక భద్రత లేదు. ఆకాశ హర్మ్యాలను కడుతున్నా.. కుటుంబానికి దూరంగా ఊడిగం చేస్తున్నా కూలీ తప్ప పెద్దగా ప్రయోజనాలు కలగడం లేదు. వీరందరికీ ప్రధానంగా ఆరోగ్య వసతి, పెన్షన్ పథకాలు కలగాలి. పనిచేసే ప్రతి ఒక్కరినీ కార్మికులుగా చూడాలి. వారికి విద్య,ఆరోగ్య, పెన్షన్ భద్రత వంటి కనీస సౌకర్యాలు కలగాలి. అలాగే అసంఘటిత కార్మికులను ఆదుకునే ప్రయత్నాలు చేయాలి. పాలకులంతా ఎసి కార్లలో, విమానాల్లో తిరుగుతూ.. ఎసి బంగలాల్లో నివస్తున్నారు. వీరికి సామాన్యుల కష్టాలు తెలియడం లేదు. ప్రజలు కట్టిన పన్నులతో జల్సాలు చేస్తున్నారు. సమాజ గతిని, పురోగతిని శాసించేది, నిర్దేశించేది శ్రామిక వర్గమే. ఆ శ్రమే వెట్టిచాకిరికి గురవుతోంది. శ్రామికుడు దోపిడీకి గురవుఉతన్నాడు. పరిస్థితులు ఇలాగే ఉంటే.. కష్టించి పని చేసే చేతులు పిడికిళ్లు బిగిస్తాయని గుర్తించాలి. ఉద్యమాలు పుట్టుకొస్తాయి. కార్మిక దినోత్సవ ఆవిర్భావాన్ని ఏ ఒక్క దేశానికో, సంఘటనకో ముడిపెట్టలేం. కానీ 1886లో షికాగోలోని హే మార్కెట్‌లో జరిగిన కార్మికుల ప్రదర్శనే ఈ మే డే పుట్టుకకు పునాది వేసిందని చెబుతారు. కానీ ఆ ప్రదర్శన ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు జరిపిన కాల్పుల్లో కొందరు



కార్మికులు చనిపోయారు. ఆ సంఘటన అనంతరం 1889 నుంచి 1890 వరకు అనేక దేశాల్లో కార్మికుల ఉద్యమాలూ, నిరసన ప్రదర్శనలూ చోటుచేసుకున్నాయి. షికాగోలో జరిగిన కార్మిక ప్రదర్శనలో చనిపోయిన వారికి గుర్తుగా మే 1ని కార్మిక దినోత్సవంగా జరుపుకోవాలన్న ఒప్పందం కూడా కుదిరింది. భారతదేశంలో చాలా ఆలస్యంగా కార్మిక దినోత్సవాన్ని జరుపుకున్నాము. 1923 మే 1వ తేదీన మద్రాసులో లేబర్ కిసాన్ పార్టీ ఆధ్వర్యంలో తొలిసారి ఈ వేడుకలను జరుపుకున్నారు. రెండో ప్రపంచ యుద్ధం తరవాత ఐరోపా దేశాల్లో మే 1వ తేదీని సెలవు దినంగా పాటించడం మొదలు పెట్టారు. అనంతరం అనేక దేశాలు ఇదే బాటలో నడిచాయి. చాలా దేశాల్లో కార్మికులకు సంబంధించిన అనేక సంక్షేమ పథకాలు ఆ రోజునే అమల్లోకి వచ్చాయి. కార్మిక దినోత్సవం సందర్భంగా చాలా దేశాల్లో కార్మికులకు సంబంధించి అనేక సంక్షేమ పథకాలు పుట్టుకొచ్చాయి. అలాగే సంక్షేమ పథకాల అమలుకు, నిరసన ప్రదర్శనలకు మే 1వ తేదీ వేదికగా మారింది. ముఖ్యంగా మేడే రోజున కార్మికులు వారి హక్కులను గుర్తు చేసుకోవడం, సమాజానికి వారు చేసిన సేవలకు గాను తగిన గుర్తింపు ఇచ్చి వారిని సన్మానించడం చేస్తున్నాం. 1916లో తొలిసారిగా రోజుకు 8 పని గంటలు మాత్రమే అన్న డిమాండ్‌కు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. మనదేశంలో ఇతర దేశాల కంటే ముందే కలకత్తాలో కార్మికుల పనిగంటల కోసం హౌరా రైల్వే స్టేషన్లో 1862లోనే సమ్మె చేశారు. 1923లో తొలిసారిగా భారత్ దేశంలో మే డే ను పాటించారు. ఆ తర్వాత 1920లో ట్రేడ్ యూనియన్ ఏర్పడడంతో అప్పటి నుంచి కార్మికవర్గాల్లో చైతన్యం మొదలైంది. దీంతో మే డే పాటిస్తున్నారు. కానీ అసంఘటిత కార్మిక వర్గం అన్ని రంగాల్లో వచ్చింది. 1985 తర్వాత చోటుచేసుకున్న ప్రైవేటైజేషన్, లిబరలైజేషన్, గ్లోబలైజేషన్ పరిణామాల వల్ల అసంఘటిత కార్మికవర్గాల కార్మిక చట్టాలు అమలుకు నోచుకోవడంలేదు. మనదేశంలో అసంఘటిత రంగం పూర్తిగా నిరాదరణకు గురవుతోంది. నిర్మాణ, వ్యవసాయ, గిర కార్మిక రంగాలు పూర్తిగా వెలివేయ వద్దాయి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 80కి పైగా దేశాల్లో కార్మిక దినోత్సవాన్ని జరుపుకుంటారు. సామాజిక న్యాయం, అందరికీ గౌరవప్రదమైన పనిని ప్రోత్సహించడానికి పాలకులు ముందుకు రావాలి. ముఖ్యంగా, ఐ.టి.రంగంలో ఎంతోమంది ఆడపిల్లలు, యువకులు పనిచేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్ శక్తులు ఎక్కడ శ్రమను దోచుకునే అవకాశం వుంటే అక్కడ కంపెనీలు పెడుతున్నారు. అమెరికాలో వున్న కంపెనీలు అక్కడ ప్రజాచైతన్యం ఉన్నది కాబట్టి కార్మిక చట్టాలు అమలుకానటువంటి ఇండియాలో కంపెనీలు పెడుతూ వాళ్ళచే 10,12 గంటలు పనిచేయి స్తున్నారు. ఐటి రంగంలో పనిచేస్తున్న విద్యావంతులైన యువత శ్రమ దోపిడీకి బలవుతున్నది. రాత్రుళ్లు ఆడపిల్లలను భద్రతలేకుండా ఇళ్ళకు పంపించడం మూలంగా నేరాల సంఖ్య కూడా పెరుగుతున్నది. పెట్టుబడిదారీ వ్యవస్థ వున్నంతవరకు శ్రమదోపిడీ, ఎక్కువ పనిచేయించుకోవడం సర్వసాధారణం. కార్మిక చట్టాలను ఐ.టి. రంగంలో కూడా అమలుకై పోరాటం ఇప్పుడు అత్యంత అవసరం. కార్మిక చట్టాలు అమలు చేయబోమని పాలకవర్గాలు బహుళజాతి కంపెనీలకు హామీలిస్తూ దేశంలోకి స్వాగతిస్తున్నాయి. అసంఘటితరంగంలో అయితే సరేసరి. ఇటీవల ప్రభుత్వం కాంట్రాక్టు, పార్ట్‌టైం ఉద్యోగుల పేరుతో ప్రవేశపెట్టిన ఔట్ సోర్సింగ్‌లోను కార్మిక చట్టాల నియమాలు అమలు కావడం లేదు. అందుకే అనేక సంస్థల్లో రెగ్యులర్ ఉద్యోగుల కన్నా కాంట్రాక్టు ఉద్యోగులే అధికమైనారు. అంతేకాకుండా ప్రభుత్వరంగంలో పనిచేసే ఉద్యోగుల సంఖ్య కూడా క్రమంగా తగ్గిపోయింది. నిరుద్యోగాన్ని, బలహీనతలను ఆసరా చేసుకొని వాళ్ళచే 10,12 గంటలు పనిచేయిస్తున్నారు. ఇది విద్య, వైద్య రంగాల్లో ప్రయివేటీకరణ పెరిగిన కొద్దీ సర్వీసు భద్రత తక్కువవుతుంది కాబట్టి శ్రమదోపిడీ కూడా పెరుగుతుంది. వెనుకటికి స్కూళ్ళు 10 నుండి 14గంటల వరకు పనిచేసేవి. పిల్లవాణ్ణి ఆరు గంటల కంటే ఎక్కువ చదివించకూడదని విద్యావేత్తలు, పరిశోధకులు చెబుతున్నా, సెమీ రెసిడెన్షియల్, రెసిడెన్షియల్ పేర పాఠశాలలు సర్వసాధారణమైపోయాయి. అందుకే ప్రైవేట్ టీచర్స్ నోరు మెదపకుండా 12 గంటలు పనిచేయాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రపంచీకరణ వలన వంద సంవత్సరాల క్రితం సాధించిన కనీస డిమాండ్లు కూడా ఈనాడు అమలుకు నోచుకోవడంలేదు. ఎనిమిది గంటల పనికోసం చేసిన పోరాటం పెట్టుబడిదారీ వర్గం పతనానికి ఆరంభమవుతుందనుకున్నాం. కానీ మళ్ళీ మార్కెట్ శక్తులు పాత పరిస్థితులకు ప్రాణప్రతిష్ఠ చేస్తున్నాయి. ఆనాటి కార్మికవర్గ చైతన్యం మరోసారి వెల్లివిరుస్తుందని, ఈ మే డే నాడు కొత్త స్ఫూర్తిని రగిలిస్తుందని ఆశిద్దాం. ప్రపంచీకరణ, సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారులు, బహుళజాతి కంపెనీలు, మొదలైనవి శ్రామిక దోపిడీకి, కార్మిక చట్టాల ఉల్లంఘనకు సంఘటితమవుతున్న ఈ తరుణంలోనే ప్రపంచ కార్మికవర్గం ఆ శక్తులను ప్రతిఘటించేందుకు ద్విగుణీకృత ఉత్సాహంతో పోరాడాలి. ప్రపంచ శాంతిని అసలు ఈ భూగోళాన్నే కాపాడుకోవాల్సిన అవసరం కూడా ఉంది. అందుకు కార్మిక శ్రేణులు ఏకం కావాల్సిన చారిత్రక సందర్భం కూడా ఇదే.

# పోరాటాలతోనే కార్మిక హక్కులకు రక్షణ

**కార్పోరేట్ సంతుష్టీకరణలో పాలకులు**

**అనేక ఆందోళనతో అడ్డుకుంటూనే ఉన్నాం**

**సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.వి నాగేశ్వరరావు**

**విజయవాడ, ఏప్రిల్ 30(ప్రజావినికిడి):**
:ప్రభుత్వాలు కార్మికుల హక్కులపైనే కాక జీవితాలపైన, ప్రజాస్వామ్య హక్కులపైన, రాజ్యాంగ హక్కులపై దాడి చేస్తున్నాయి. ఈ హక్కులను కాపాడుకోవడానికి యావత్ కార్మికవర్గం పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.వి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. లేబర్‌కోడ్లను రద్దు చేయాలని, కార్మిక హక్కులు అమలు కావాలని అన్నారు. నిరంతరం కార్మిక దోపిడీ జరుగుతున్నా పాలకుల్లో చలనం లేదన్నారు. ఏటేటా మేడేలు జరుపుకోవడం తప్ప కార్మికుల పక్షాన నిర్ణయాలు తీసుకోవడం లేదని ఆయన ఆవేదన చెందారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకై మానవ హారాలు, పాదయాత్రలు, మహాప్రదర్శనలు నిర్వహించారు. విశాఖ స్టీల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఐదు సంవత్సరాలుగా రాజీ లేని పోరాటాలు సాగుతున్నాయి. వీటి ఫలితంగా నేటి వరకూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై ముందుకు సాగలేకపోయిందన్నారు. అయితే దానిని అభివృద్ధి చేసి, దానికి గనులు కేటాయించి, మరింత పటిష్టంగా తీర్చిదిద్దే ప్రయత్నం



చేయడం లేదన్నారు. తిరుపతి టిటిడి ఫారెస్టు కార్మికులు 38 నెలల పాటు ఆందోళనలు కొనసాగించారు. అనేక ఒత్తిళ్లు చేసినా కార్మికులు పోరాటాన్ని ఆపలేదన్నారు. విజయనగరం మిమ్స్ మెడికల్ కాలేజీ కార్మికులు 80 రోజుల పాటు పోరాటాలు చేశారు. 32 మందిపై అక్రమ కేసులు బనాయించారు. ఇద్దరు సిఐటియు నాయకులతో సహా 19 మంది కార్మికులను విశాఖ సెంట్రల్ జైలుకు 14 రోజులు రిమాండ్‌కు పంపారు. అయినా ఈ నిర్బంధాన్ని ఎదిరించి కార్మికులు పోరాటాన్ని కొనసాగించారు. నెల్లూరు మున్సిపాల్టీలో వర్క్ ఔట్‌సోర్సింగ్ విధానాన్ని అనుసరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం టెంటర్లు పిలవడానికి వ్యతిరేకంగా కార్మికులు 14 రోజుల పాటు సమరశీలంగా సమ్మె నిర్వహించారు. పోలీసు నిర్బంధాన్ని ఎదుర్కొని సమ్మెను జయప్రదంగా నిర్వహించారు. దీంతో ప్రభుత్వం టెండర్లను ఉపసంహరించుకోవడమే కాక, కార్మికులపై అక్రమంగా బనాయించిన కేసులను ఎత్తివేయక తప్పలేదు. విశాఖ డెయిరీ కార్మికుల పోరాటం, సినర్జీస్ కార్మికుల సమ్మె, బ్రాండిక్స్ కార్మికుల మూడు రోజుల సమ్మె, రాజమండ్రి ఆంధ్రా పేపర్‌మిల్లు కార్మికులు 2,500 మంది 34 రోజుల సమ్మె, ఎన్‌టిఆర్ జిల్లా ముఠా కార్మికుల సమ్మెలు ఈ కాలంలో జరిగాయి. కార్మికులు పోరాటాలతో కొన్ని విజయాలు సాధించుకోగలిగారు. నెల్లూరులో జెన్కోను అదానీకి కట్టబెట్టే ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ 396 రోజుల ఆందోళనను కార్మికులందరూ కలసి నిర్వహించారు. కార్మికులు, ఇంజినీర్లు కలసి సిఐటియు చొరవతో జెఎసి గా ఏర్పడి పోరాడారు. ప్రజల మద్దతు పొందారు. ప్రైవేటీకరణ ప్రతిపాదనను వెనక్కి నెట్టారు. గత ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీలు 42 రోజుల పాటు ఎస్మాను సైతం ధిక్కరించి, నిర్బంధాన్ని ఎదురించి సమరశీలంగా సమ్మె నిర్వహించారు. గ్రాట్యూటీ, రిటైర్మెంట్ బెనిఫిట్, రిటైర్మెంట్ వయసు పెంపు, హెల్పర్ల ప్రమోషన్‌కు వయోపరిమితి పెంపు, మినీ అంగన్‌వాడీ సెంటర్లు మెయిన్ సెంటర్లుగా మార్పు, సమ్మె కాలపు వేతనాలు తదితర జీఓలను సాధించుకున్నారు. మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికులు 16 రోజుల సమ్మెను సమరశీలంగా నిర్వహించారు. వేతన పెంపు, ఇతర సమస్యలు పరిష్కరించుకున్నారు.


# సీతారాం ఆత్మహత్యలో చీకటి కోణం

**భార్య అక్రమ సంబంధాలతో తీవ్ర మనోవేదన**

**తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డ టెక్కీ**

**సూసైడ్ నోట్ ఆధారంగా వివరాలు వెల్లడి**

**హైదరాబాద ఏప్రిల్ 30(ప్రజావినికిడి):**
రాష్ట్రంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో కలకలం సృష్టించిన టెకీ సీతారాం ఆత్మహత్య కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ కేసులో సీతారాం రాసిన 19 పేజీల సూసైడ్ నోట్ బయటకు రావడంతో ఆత్మహత్యకు గల కారణాలు తెలిశాయి. భార్య ఇతరులతో శారీరక సంబంధాలతో విసిగిపోయి సీతారాం ఆత్మహత్య చేసుకున్నట్టు నోట్ ద్వారా వెల్లడించాడు. తను వద్దని చెప్పినా వినలేదని సీతారాం పేర్కొన్నాడు. ఏపీలోని మార్కాపురానికి చెందిన సీతారాం, నంద్యాలకు చెందిన రేణుకకు 2018లో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. సీతారాం సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. సీతారాం కుటుంబం బాచుపల్లిలో స్థిరపడింది. అయితే రేణుక తన భర్తకు తెలియకుండా ముగ్గురితో అక్రమ సంబంధం పెట్టుకొని, ప్రైవేట్ వీడియోలు తీసుకుంది. ఆ దారుణాలు చూడలేక భర్త సీతారం



హుస్సేన్ సాగర్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. భర్తకు తెలియకుండా ముగ్గురితో అక్రమ సంబంధం పెట్టుకున్న రేణుక రమణారెడ్డి అనే వ్యక్తితో కలిసినప్పుడు ప్రైవేట్ వీడియోలు తీసుకుంది. ఆ వీడియోలను రమణారెడ్డి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయగా.. తన భార్య నిజ స్వరూపం తెలిసిన సీతారాం ఫిబ్రవరి నెలలో 19 పేజీల సూసైడ్ లేఖ రాసి హుస్సేన్ సాగర్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.సూసైడ్ లేఖలో నా భార్య రేణుకకు ఏలోటు రాకుండా చూసుకున్నా.. కానీ ఆమె ఏడాదిన్నరలోనే ముగ్గురితో అక్రమంగా శారీరక సంబంధం పెట్టుకుంది. అంతేకాకుండా ప్రైవేట్ వీడియోలను రికార్డు చేసుకోగా.. ఓ లవర్ దానిని ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశాడు. ఆ దారుణాలను చూసి నేను ఎలా తట్టుకోగలగాలి.. అసలు రేణుకకు ఏం కావాలి. ప్రేమనా లేక శృంగారమా..? నా భార్యకు ఏలోటు రాకుండా చూసుకున్నా.. కానీ ఆమె నాకు నమ్మక ద్రోహం చేసింది అంటూ తన ఆవేదన తెలుపుతూ బలవన్మరణానికి పాల్పడ్డాడు. సూసైడ్ నోట్ ఆధారంగా దర్యాప్తు జరిపి రేణుకతోపాటు ఆమె ఇద్దరు లవర్స్ రమణారెడ్డి, శ్రవణ్ లను పోలీసులు అరెస్ట్ చేశారు. రేణుక నమ్మకద్రోహం వల్ల నెలకు రూ.2 లక్షలు సంపాదించే సీతారాం ప్రాణాలు పోగొట్టుకున్నాడని, ఇద్దరు పిల్లలు అనాథలు అయ్యారని కుటుంబసభ్యుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# నష్టాలతో ప్రారంభమైన మార్కెట్లు

## రూపాయి విలువ 95.07కు చేరిక

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 30(ప్రజావినికిడి):**
దేశీయ మార్కెట్లు గురువారం భారీ నష్టాల్లో ప్రారంభమయ్యాయి. ఇరాన్ ఓడరేవులపై అమెరికా దిగ్బంధనం కొసాగుతుండటంతో చమురు ధరలు భగ్గమంటున్నాయి. దాంతో మన సూచీలపై బేర్ పట్టు బిగించింది. దాంతో ట్రేడింగ్ ప్రారంభంలోనే సెన్సెక్స్ 1000 పాయింట్ల వరకు నష్టపోయింది.



ఉదయం సెన్సెక్స్ 868 పాయింట్లు పతనమై, 76,623 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 278 పాయింట్లు క్షీణించి, 23,899 వద్ద కదలాడుతోంది. నిఫ్టీ సూచీలో బజాజ్ ÷నాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, కోల్ ఇండియా, ఓఎన్‌జీసీ షేర్లు లాభాల్లో ఉండగా.. ఎటర్నల్, శ్రీరామ్ ఫైనాన్స్, అల్ట్రా టెక్ సిమెంట్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, ఎంఅండ్ఎం షేర్లు నష్టాల్లో ఉన్నాయి. అంతర్జాతీయ విపణిలో దేశీయ కరెన్సీ రూపాయి విలువ అంతకంతకూ క్షీణిస్తోంది. ఉదయం సెషన్‌లో తొలిసారి ఏకంగా 95.07 వద్ద ప్రారంభమై.. సరికొత్త జీవనకాల కనిష్ఠాన్ని తాకింది.

----

# స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 30(ప్రజావినికిడి):**అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ తగ్గడం, డాలర్ బలపడడం వంటి కారణాలతో బంగారం ధరలు క్రమంగా తగ్గుతూ వస్తున్నాయి. గత కొన్ని రోజులుగా పెరుగుతూ వెళ్లిన బంగారం ధరలు ప్రస్తుతం తగ్గుతుండడంతో కొనుగోలుదారులకు కొంత ఊరట లభిస్తోంది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, గురువారం ఉదయం 6.00 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,50,430గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,37,890గా ఉంది. ఇక దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,50,580గా, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,38,040గా ఉంది. మరోవైపు వెండి ధరలు కూడా తగ్గుదల నమోదు చేశాయి. కిలోకు వంద రూపాయల మేర తగ్గాయి. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి ధర రూ.2,64,900గా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో ప్రస్తుతం కిలో వెండి ధర రూ.2,54,900గా ఉంది. అలాగే చెన్నైలో కిలో వెండి ధర రూ.రూ.2,64,900గా, బెంగళూరులో రూ.రూ.2,54,900 ఉంది.




# కారంపూడి నగల దోపిడీ

## పోలీసుల అదుపులో నలుగురు నిందితులు

**పల్నాడు, ఏప్రిల్ 30(ప్రజావినికిడి):** కారంపూడిలో పట్టపగలే దాడి చేసి బంగారు నగలు చోరీ చేసిన కేసులో నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఎప్రిల్ 27న మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో బంగారు నగలు దుకాణాలకు అందించేందుకు వినుకొండకు చెందిన యక్కల శ్రీనివాసరావు కారంపూడి వచ్చారు. అతడిపై నలుగురు వ్యక్తులు దాడి చేసి రూ.కోటి విలువ చేసే ఆభరణాల సంచిని లాక్కెళ్లిన విషయం తెలిసిందే. ఎస్పీ కృష్ణారావు ఆదేశాలతో ఐదు బృందాలను నియమించి విచారణ చేపట్టారు. వినుకొండలో శ్రీనివాసరావు ఇంటి నుంచి బయలుదేరిన దగ్గర నుంచి చోరీ జరిగి, దుండగులు పారిపోయే మార్గాల్లో సీసీ ఫుటేజీలను పరిశీలించారు. ఘటన జరిగిన ముందురోజు నిందితులు కారంపూడిలోని పలు ప్రాంతాల్ని పరిశీలించినట్లు సీసీ ఫుటేజీలో గుర్తించారు. నిందితుల్లో ఒకరు గాంధీబొమ్మ సెంటర్లోని ఓ దుకాణంలో శీతల పానీయం తాగి ఫోన్‌పే చేశాడు. అతడి ఫోన్ నంబరు ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. వీరికి వినుకొండ, కారంపూడి, పిడుగురాళ్లలో కొందరు సహకరించినట్లు గుర్తించి, వారి వివరాలు సేకరించినట్లు తెలుస్తోంది. సాంకేతికత ఆధారాలతో నిందితుల్ని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

-----------

# నూటికి నూరు శాతం ఫలితాలతో
## కొంగర కలన్ నారాయణ పాఠశాల
# అమ్మాయిల సరికొత్త రికార్డు..

### పదవ తరగతి ఫలితాలపై ప్రిన్సిపాల్ రజినీ హర్షం..






**రంగారెడ్డి,(ప్రజావినికిడి):**
మరోసారి రంగారెడ్డి జిల్లా కొంగరకలన్ నారాయణ పాఠశాల అమ్మాయిల హవా కొనసాగించారు. ఎవరికి సాధ్యం కానీ ఫలితాలతో సరికొత్త చరిత్ర 500 లకు పైగా మార్కులు సాధించిన 247 మంది విద్యార్థులు సృష్టించారనీ పాఠశాల ఉపాధ్యాయులు
జి ఎం గోపాల్ రెడ్డి ఏజీఎం మనోహర్ రెడ్డి
ఆర్&డి శివరంజని సమన్వయాకర్త.మోహన్ ప్రిన్సిపాల్ రజినిఅకడమిక్ డీన్స్ ఆయా ఎ ఓ టీచర్ తెలిపారు.బుధవారం విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో నారాయణ పాఠశాల వద్ద ఉన్న గత కొన్ని సంవత్సరాలుగా ప్రతిసారి రిసల్ట్ ఈసారి ఇంకా ఎక్కువ 100% రిజల్ట్ సాధించారు. అమ్మాయిల జైత్రయాత్ర కొనసాగించారు. పాఠశాలలో మొత్తం 292మంది విద్యార్థినిలు ఉండగా 292మంది అమ్మాయిలు మొదటిసారిగా మొత్తం పూర్తి ఫలితాలు సాధించి పట్టుబిగించారు. 292మంది అమ్మాయిలు ఉత్తీర్ణత సాధించారు.కాగా,మదసూ శ్రీ విశాలాక్షి తెలంగాణ నాలుగవ ఉత్తమం సాధించారు. 594/600 పాఠశాల టాపర్ గా నిలిచారని ప్రిన్సిపాల్ తెలిపారు. మరివగు యామిక్ రెడ్డి 593/600, శిపురం సహస్ర 591/600,వనం హారిని 591/600 సహస్ర 590/600 ప్రతిభ తో సరికొత్త చరిత్ర సృష్టించి ఔరా అనిపించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రజినీ మాట్లాడుతూ, విద్యార్థుల విజయానికి కేరాఫ్ అడ్రస్ కొంగరకలన్ నారాయణ పాఠశాల అమ్మాయిలని అన్నారు.టీచర్ల కృషి,పట్టుదల, విద్యార్థినిలు కష్టపడి చదవడం వల్లనే ఫలితాలు రావడం జరిగిందన్నారు.ముఖ్యంగా ప్రత్యేక తరగతులు,శ్రద్ధ ద్వారానే నూటికి నూరు శాతం ఫలితాలు సాధించామని సంతోషం వ్యక్తం చేశారు ముందు ముందు విద్యార్థులు మరిన్ని విజయాలు సాధించి, పాఠశాలలకు,ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సూచించారు.



ఔరా అనిపించి మళ్ళీ మెరిసిన కొంగరకలన్ నారాయణ పాఠశాల అమ్మాయిలు.

# దండెపు బస్వానందంకు ఘన సన్మానం



**హిమాయత్ నగర్,(ప్రజావినికిడి):**
హోమియో వైద్యంలో ప్రముఖ పేరు గాంచిన డాక్టర్ డండెపు బస్వానందంకు ఆదర్శ కిరణం మాస పత్రిక ఏడిటర్ బాల్‌రాజ్ గౌడ్ వారి సతీమణి సుజాత కలిసి శాలువాతో సత్కరించి మెమెంటోను అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హోమియో వైద్య రంగంలో ఎన్నో సేవలు చేసి ప్రఖ్యాత పేరుగాంచారని కొనియాడారు. వైద్యం ద్వారా ఎన్నో రోగాలను నయం చేసిన ఘనత డాక్టర్ దండెపు బస్వానందందని ప్రశంసించారు. ప్రజాలకు మరిన్ని సేవలు చేసి ప్రజాదారణ పొందాలని ఆకాంక్షించారు.

# దళితులందరూ ఐక్యంగా ఉండాలి



**నాంపల్లి,(ప్రజావినికిడి):** రవీంద్రభారతిలో మహనీయుల జయంతి ఉత్సవాలు,దళిత రత్న అవార్డుల ప్రధాన ఉత్సవ కార్యక్రమం జరిగింది.డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్,డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల కమిటీ, మాదిగ హక్కుల దండోరా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ మంత్రి వర్యులు డాక్టర్ ఏ చంద్రశేఖర్ అతిథిగా పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు,గడ్డం వంశీకృష్ణ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మహనీయుల చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్,డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల కమిటీ వైస్ చైర్మన్ మేతరీ రోజా రాణి ఆధ్వర్యంలో జరిగిన పలువురు మాట్లాడారు. మహనీయులు బాబు జగ్జీవన్ రామ్,డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మహాత్మ జ్యోతిరావు పూలే జయంతుల మాసమైన ఏప్రిల్ మాసంలో ఈ ఉత్సవాలు జరగడం సంతోషకరమని వక్తలు అన్నారు. దళితులందరూ ఐక్యంగా ఉండాలని విద్య ద్వారా ముందుకెళ్లాలని ఆర్థికంగా ఎదిగి సమాజానికి దిక్సూచిగా ఉండాలని వారు అన్నారు.డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, జగ్జీవన్ రామ్, మహాత్మ పూలే వల్లనే అణగారిన వర్గాలు అభివృద్ధి చెందాయని వారన్నారు.ఈ కార్యక్రమంలో రేగుంట సునీల్ మాదిగ,డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, ఉత్సవాల కమిటీ వైస్ చైర్మన్లు బైండ్ల వెంకటేశం, నాయకులు కవ్వంపెల్లి రవి, బుగ్గ మైసన్న, భవాని రెడ్డి,ఎలుక పెల్లి రాజేందర్, తప్పేట్ల ప్రవీణ్, సప్పి,పోచన్న,మేరీ మాదిగ,బంగారు దుర్గాభవాని, నందిని ఉప కులాల నాయకులు రాజలింగం,గంగ నరసయ్య, పశుపతి తదితరులు పాల్గొన్నారు.

# పది ఫలితాలలో స్కూల్ టాపర్ వినీత్ రెడ్డి కి
# ఇరవై వేల నగదు అందజేసిన స్కూల్ ఛైర్మన్ సామల సందీప్ రెడ్డి






**ఘట్ కేసర్,(ప్రజా వినికిడి):**
విద్యార్థి దశ నుండే పిల్లలకు చదువుతో పాటు సంస్కృతి సంప్రదాయాలు, క్రీడలు,సామాజిక అంశాలపై అవగాహన కల్పిస్తే వారి భవిష్యత్తు బంగారుమయం అవుతుందని అంజని స్కూల్ ఛైర్మన్ సామల సందీప్ రెడ్డి పేర్కొన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్ కేసర్ మండలం నారపల్లి లోని అంజని స్కూల్ లో ఇటీవల విడుదల అయిన పదవతరగతి ఫలితాలలో అద్భుతమైన ప్రదర్శనతో 571/600 మార్కులు సాధించి స్కూల్ టాపర్ గా నిలిచిన పి.ప్రణీత్ రెడ్డి ని వారి తల్లిదండ్రులను సందీప్ రెడ్డి ఘనంగా సన్మానించి ఇరవై వేల రుపాయల నగదు బహుమతిని అందజేశారు.ఈ సందర్భంగా సందీప్ రెడ్డి మాట్లాడుతూ,ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన పదవతరగతి ఫలితాలలో తమ స్కూల్ నుండి పదిహేను మంది అయిదు వందల మార్కులకు పైగా పదిహేడు మంది నాలుగు వందల మార్కులకు పైగా పన్నెండు మంది విద్యార్థులు మూడు వందలకు పైగా మార్కులు సాధించడం పట్ల ఆనందంగా ఉందన్నారు. ఆహ్లాదకరమైన, ఎలాంటి కాలుష్యం లేని ప్రాంతంలో తమ క్యాంపస్ ను నెలకొల్పి అతి తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని అన్నారు.తమ విద్యార్థుల అద్భుతమైన ప్రదర్శనకు కారణమైన తమ స్కూల్ టీచింగ్ స్టాఫ్, సహకరించిన తల్లిదండ్రులకు స్కూల్ ఛైర్మన్ సామల సందీప్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు .

# టీఎన్జీఓస్ ఆధ్వర్యంలో మే 5న రిలే నిరాహార దీక్ష..



**నాంపల్లి,(ప్రజావినికిడి):**
తెలంగాణ ఉద్యోగుల (టీఎన్జీఓస్) ఆధ్వర్యంలో మే 5న హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ వద్ద 'రిలే నిరాహార దీక్ష'ను చేపట్టనున్నట్టు టీఎన్జీఓస్ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.హుస్సేనీ (ముజీబ్) ఓ ప్రకటనలో పేర్కొన్నారు.ఈ సందర్భంగా వారు నాంపల్లి టీఎన్జీఓస్ కార్యాలయంలో మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యోగుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలను అమలు పరచడంలో నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు.మే 5 వరకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే రిలే నిరాహార దీక్షను చేపడుతామని హెచ్చరించారు. ఉద్యోగులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ ఏ.శ్యామ్ సుందర్, డీటీఎఫ్ ఎం.వినోద్ కుమార్, ఎస్టీయూటీఎస్ మొహమ్మద్ ఇఫ్తేకారుద్దీన్, పీఆర్టీయూటీఎస్ వి.అశోక్,రమేష్, క్లాస్-4 ఎంప్లాయీస్ యూనియన్ నుండి వి.సత్యనారాయణ టీఎన్జీఓస్ యూనియన్ కురాడి శ్రీనివాస్, పి.పేరయ్య,షౌకత్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# కరెంట్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తరాదు

**భారీగా పెరిగిన విద్యుత్ డిమాండ్**
**అధికారులతో సమీక్షించిన డిప్యూటి సిఎం భట్టి**

**హైదరాబాద్, ఏప్రిల్ 30(ప్రజావినికిడి):**రాష్ట్రంలో ఎండల తీవ్రత దృష్ట్యా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తట్టుకుని, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నిరంతరాయంగా కరెంట్ సరఫరా చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా పెరుగుతున్న విద్యుత్తు డిమాండ్ నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రజాభవన్‌లో విద్యుత్ సరఫరా పై ఇంధన శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.రాష్ట్రంలో భానుడి భగభగలకు తోడు ఇళ్లు, కార్యాలయాల్లో ఏసీలు, కూలర్ల వాడకం విపరీతంగా పెరిగిందని అధికారులు మంత్రికి వివరించారు. దీనికి వ్యవసాయ అవసరాలు కూడా తోడవడంతో గ్రిడ్‌పై ఒత్తిడి పెరుగుతోందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా విద్యుత్ మార్కెట్‌పై ఒత్తిడి ఉన్నప్పటికీ, రాష్ట్ర అవసరాలకు ఏమాత్రం లోటు రాకుండా పవర్ ఎక్స్ఛేంజీల ద్వారా అదనపు విద్యుత్ కొనుగోళ్లు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఆసుపత్రులు, తాగునీటి సరఫరా పథకాలు మరియు అత్యవసర సేవలకు విద్యుత్ అంతరాయం కలగకుండా నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని, జల విద్యుత్ ఉత్పత్తిని సమర్థంగా నిర్వహించాలని సూచించారు. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున, అన్ని విద్యుత్ సంస్థలు సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని వివరించారు. రాష్ట్ర విద్యుత్ వ్యవస్థ స్థిరంగా ఉందని, ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు తగిన ఏర్పాట్లు చేశామని అధికారులు మంత్రికి హామీ ఇచ్చారు. పరిస్థితిని నిశితంగా పర్యవేక్షించాలని, అన్ని వర్గాల వినియోగదారులకు నమ్మకమైన, నాణ్యమైన విద్యుత్ సరఫరాను కొనసాగించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ అగ్ర ప్రాధాన్యమని స్పష్టం చేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, క్షేత్రస్థాయి సిబ్బందిని నిరంతరం అప్రమత్తంగా ఉంచాలని ఆదేశించారు.

# జూనియర్ అసిస్టెంట్,శంకర్‌పదవీ విరమణ



**రంగారెడ్డి,(ప్రజావినికిడి):**ఎం శంకర్, జూనియర్ అసిస్టెంట్, గురువారం ఈ రోజు పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా, ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమం లో గౌరవనీయులు శ్రీమతి టి ఎల్ సంగీత,డి ఆర్ ఓ, శ్రీ సునీల్ ఎన్ ,ఎ ఒ,నవీన్ అకౌంటెంట్ ,ఇతర రెవెన్యూ సిబ్బంది, నాల్గవ తరగతి ఉద్యోగులు పాల్గొనడం జరిగింది.

# బుమ్రా కూడా మనిషే.. మరమనిషి కాదు

● ముంబై ఇండియన్స్ బౌలింగ్ కోచ్ కీరన్ పోలార్డ్



పేలవ ఫామ్‌తో సతమతమవుతున్న ముంబై ఇండియన్స్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు ఆ జట్టు మేనేజ్‌మెంట్ అండగా నిలిచింది. బుమ్రా కూడా మనిషేనని, ఫామ్ కోల్పోవడం సహజమేనని ముంబై ఇండియన్స్ బౌలింగ్ కోచ్ కీరన్ పోలార్డ్ అన్నాడు. అతనికి ముంబై ఇండియన్స్ అండగా ఉంటుందని స్పష్టం చేశాడు.ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో బుమ్రా దారుణంగా విఫలమయ్యాడు. 4 ఓవర్లు బౌలింగ్ చేసి ఒక్క వికెట్ తీయకుండా 54 పరుగులు సమర్పించుకున్నాడు. ఇప్పటి వరకు 8 మ్యాచ్‌లు ఆడిన బుమ్రా రెండు వికెట్లు మాత్రమే తీసాడు. బుమ్రా ఐపీఎల్ కెరీర్‌లోనే ఈ సీజన్ అతనికి వరస్ట్‌గా మారిపోయింది. దాంతో అతనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్ అనంతరం మీడియా సమావేశంలో పాల్గొన్న కీరన్ పొలార్డ్.. బుమ్రా వైఫల్యం గురించి మాట్లాడాడు. 'ఏ ఆటగాడైనా సరైన ప్రదర్శన చేయలేకపోతే.. వెంటనే ప్రతి చిన్న విషయాన్ని నిశితంగా పరిశీలిస్తుంటాం. సదరు ఆటగాడు ఎందుకు ఆడలేకపోతున్నాడనే దానిపై చర్చలు పెడుతుంటాం. ఇలాంటి వాటి నుంచి జస్‌ప్రీత్ బుమ్రా మినహాయింపేమీ కాదు. గత కొన్నేళ్లుగా అతను ఎలాంటి ప్రదర్శన కనబర్చాడో మనం చూశాం. బుమ్రా కూడా మనిషే కదా.. అతను కూడా తప్పులు చేస్తాడు. కాలం కలిసి రానప్పుడు గతంలో చేసిన మంచిని గుర్తు చేసుకోవాలి. బుమ్రా తన స్థాయికి తగ్గట్లు రాణించ లేకపోయాడు. అయినా.. ఇప్పటికీ అతను వరల్డ్ నంబర్‌వన్ బౌలర్. అలానే మా ముంబై ఇండియన్స్‌కు కీలక బౌలర్.

# అగ్రస్థానంపై కన్నేసిన ఆర్సీబీ

ఇండియన్ ప్రీమియర్ లీగ్ వేదికగా నేడు మరో రసవత్తపోరుకు రంగం సిద్ధమైంది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా జరగనున్న ఈ మ్యాచ్‌లో ఆతిథ్య గుజరాత్ టైటాన్స్ జట్టుతో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తలపడనుంది. ఈ మ్యాచ్‌లో విజయం సాధించి పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకోవాలని ఆర్సీబీ చూస్తుండగా.. మరో విజయాన్ని తమ ఖాతాలో వేసుకోని ప్లేఆఫ్స్‌కు మార్గం సుగమం చేసుకోవాలని గుజరాత్ జట్టు ప్లాన్ చేస్తోంది. ఐపీఎల్ పాయింట్ల పట్టిక ప్రకారం.. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు ఇప్పటివరకు ఆడిన 8 మ్యాచ్‌లలో 6 గెలిచింది. ం1.919 నెట్ రన్ రేట్‌తో టేబుల్‌లో రెండో స్థానంలో నిలిచింది. ఒకవేళ గుజరాత్ టైటాన్స్ మ్యాచ్‌లో గెలిస్తే.. ఆర్సీబీ అగ్రస్థానానికి చేరుతుంది. ఆర్సీబీ ఆడిన గత 5 మ్యాచ్‌లను పరిశీలిస్తే 4 విజయాలు ఉండడం విశేషం. అలాగే శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలోని గుజరాత్ టైటాన్స్ జట్టు ఆడిన 8 మ్యాచ్‌ల్లో 4 మ్యాచ్‌ల్లో విజయం సాధించి.. పాయింట్ల పట్టికలో -0.475 నెట్ రన్ రేట్‌తో 5వ స్థానంలో నిలిచింది.



ఈ మ్యాచ్ అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో గురువారం అనగా ఏప్రిల్ 30న, భారత కాలమానం ప్రకారం రాత్రి 7:30 గంటలకు జరుగుతుంది. టాస్ రాత్రి 7 గంటలకు ఉంటుంది. ఈ మ్యాచ్ స్టార్ స్పోర్ట్స్ లేదా జియో హాట్‌స్టార్ వేదికలా ప్రత్యక్ష ప్రసారం చూడవచ్చు. ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు 7 సార్లు తలపడ్డారు. అందులో ఆర్సీబీ 4 మ్యాచ్‌ల్లో గెలుపొందగా.. గుజరాత్ టైటాన్స్ 3 మ్యాచ్‌ల్లో నెగ్గింది. దీన్ని బట్టి పరిశీలిస్తే గుజరాత్‌పై ఆర్సీబీ పైచేయిగా ఉంది. అయితే నేడు జరిగే మ్యాచ్‌లో ఏం జరుగుతుందో చూడాలి. ఈ రెండు టీమ్స్ కలిసి ఏప్రిల్ 24న బెంగళూరులోని ఎం.చిన్నస్వామి స్టేడియంలో తలపడ్డారు. ఆ మ్యాచ్‌లో ఆర్‌సీబీ 5 వికెట్ల తేడాతో గెలిచింది. జీటీ 205/3 స్కోరు చేసింది. ఇప్పుడు లీగ్ దశలో మరోసారి ఇరు జట్లు తలపడనున్నాయి. ఆ మ్యాచ్‌లో సాయి సుదర్శన్ సెంచరీ సాధించగా, శుభ్‌మన్ గిల్ 32 పరుగులు చేశాడు. ఆర్‌సీబీ లక్ష్యాన్ని ఛేదించి, 206/5 స్కోరుతో ముగించింది. విరాట్ కోహ్లీ 81 పరుగులు చేయగా, దేవదత్ పడిక్కల్ 55 పరుగులు చేశాడు. ఈ మ్యాచ్‌లో టోర్నీలో అత్యధిక పరుగులు రాబట్టి విరాట్ కోహ్లీ ఆరెంజ్ క్యాప్ దక్కించుకున్నాడు. అలాగే గుజరాత్ టైటాన్స్ జట్టుపై అతని సగటు 60కి పైగా ఉంది. అలాగే అత్యధిక పరుగులు సాధించిన వారిలో గుజరాత్ టైటాన్స్ తరఫున పోటీలో ఉన్నాడు.

# సూర్య ఆటపై మండిపడుతున్న అభిమానులు



2026 ఐపీఎల్‌లో భారీ అంచనాలతో బరిలోకి దిగిన ముంబయి ఇండియన్స్ పేలవ ప్రదర్శన కొనసాగుతోంది. ముఖ్యంగా ఆ జట్టు స్టార్ ప్లేయర్ సూర్య కుమార్ యాదవ్ ఫామ్ ఆందోళన కలిగిస్తోంది. తాజాగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్‌లోనూ ఇదే పరిస్థితి. ఐదు పరుగులే చేసి పెవిలియన్ బాట పట్టాడు. ఈ సీజన్‌లో ఎనిమిది మ్యాచ్‌లు ముగిసినా సూర్య నుంచి చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ రాలేదు. దీంతో "స్కై"పై అభిమానులు విమర్శలు గుప్పిస్తున్నారు. అతడి కెరీర్ ముగిసినట్లేనా అంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.ఈ సీజన్‌లో సూర్యకుమార్ పూర్తిగా ఫామ్ కోల్పోయాడు. ఎనిమిది ఇన్నింగ్స్‌లలో 20.25 సగటున 162 పరుగులు మాత్రమే చేశాడు. సగటు మరీ దారుణంగా ఉంది. స్ట్రైక్ రేట్ 140.87 నమోదైంది. అయితే మిడిలార్డర్‌లో బాగా ఆడతాడనుకున్న స్కై ఈ సీజన్‌లో సత్తా చాటలేకపోతున్నాడు. చివరి ఆరు ఇన్నింగ్స్‌లో సూర్య వరుసగా 6, 33, 0, 15, 36, 5 స్కోర్లు చేశాడు. అప్పుడప్పుడు మెరిసినా, ఈ సీజన్‌లో గేమ్‌ఛేంజర్ లాంటి ఆట మాత్రం ఆడలేకపోయాడు. ముంబయి ఇండియన్స్ మిడిల్ ఆర్డర్‌కు సూర్యకుమార్ ఎంతో కీలకం. ఓపెనర్లు కష్టపడుతున్న సమయంలో బాధ్యత తీసుకోవాల్సిన అతడు తరచూ నిరాశ పరుస్తున్నాడు.సూర్యకుమార్ ఫామ్ విఫలమవుతుండటంపై సోషల్‌మీడియాలో తీవ్ర చర్చ జరుగుతోంది. గతంలోలాగా సూర్య ఎందుకు ఆడలేకపోతున్నాడని, అతడి పేలవ ప్రదర్శన వల్ల టీమ్ నుంచి వైదొలగాల్సిన పరిస్థితి ఏర్పడుతుందా అంటూ కామెంట్లు పెడుతున్నారు. కీలక మ్యాచ్‌లలో రాణించలేకపోతున్నాడని అంటున్నారు. సూర్యకుమార్ ముంబయి ఇండియన్స్ స్టార్ బ్యాటర్లలో ఒకడు. 'సూర్య కంప్లీట్‌గా ఫామ్ కోల్పోయాడు. అసలు అతడు టచ్‌లోనే లేడు. ఇలాంటి వ్యక్తి టీమ్‌ఇండియాకు ఎలా నాయకత్వం వహిస్తున్నాడో అర్థం కావట్లేదు. కెప్టెన్ అనేవాడు ముందుండి జట్టును నడిపించాలి. కానీ అతడు పరుగులు చేయడానికి తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాడు. ఇది ఇలాగే కొనసాగితే అతడు అనేక ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సి ఉంటుంది. కెప్టెన్సీ అనేది ప్రదర్శన ఆధారంగా వస్తుంది' అని ఓ నెటిజన్ ఎక్స్‌లో రాసుకొచ్చాడు. అలాగే 2024 సౌతాఫ్రికాతో సిరీస్ నుంచే సూర్య ఫామ్‌లో లేడని, అతడు 2025 ఆసియా కప్‌లోనూ విఫలమయ్యాడని మరో నెటిజన్ పోస్టు చేశాడు. టీ20 వరల్డ్‌కప్‌లోనూ సూర్య ఒక్క మ్యాచ్‌లో మాత్రమే రాణించాడని రాసుకొచ్చాడు. సూర్య కెరీర్ దాదాపు ముగిసినట్లే! 2028 టీ20 వరల్డ్‌కప్ కోసం టీమ్‌ఇండియా ఇప్పట్నుంచే కొత్త కెప్టెన్‌ను నియమించి ప్రిపరేషన్ ప్రారంభించాలని మరో యూజర్ అన్నాడు. అయితే మరికొంత మంది మాత్రం సూర్యకు మద్దతుగా నిలుస్తున్నారు. ప్రస్తుతం సూర్యకు బ్యాడ్ ఫేజ్ నడుస్తుందని, కొంత ఓపిక పడితే అతడు సెట్ అవుతాడని భారీ ఇన్నింగ్స్‌తో కమ్‌బ్యాక్ అయ్యే ఛాన్స్ ఉందని అంటున్నారు. అయితే సూర్య ఇప్పటికైనా ఫామ్ అందుకొని పరుగులు సాధించాల్సిన అవసరం ఉంది. లేదంటే టీమ్‌ఇండియాలో అతడి స్థానం కూడా గల్లంతయ్యే పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉంది. ప్రస్తుత ఐపీఎల్‌లో వైభవ్ సూర్యవంశీ, ప్రియాంశ్ ఆర్య లాంటి కుర్రాళ్లు రాణిస్తుండడం, శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా ఆకట్టుకుంటుండంతో జట్టులో చోటు కోసం తీవ్ర పోటీ ఏర్పడుతుంది. అందుకే 35ఏళ్ల సూర్యను టీ20 జట్టులో కొనసాగించే ఆలోచన మేనేజ్‌మెంట్ చేయదని వాదనలు వినిపిస్తున్నాయి.





# ఐపీఎల్‌లో దుమ్మురేపుతున్న సన్‌రైజర్స్..

ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు తన అద్భుత ప్రదర్శనతో దూసుకెళ్తూ.. ప్రత్యర్థి జట్లకు చుక్కలు చూపిస్తుంది. వరుసగా 5 విజయాలతో అదరగొట్టింది ఎస్ఆర్‌హెచ్ టీమ్. కేవలం మ్యాచ్‌ల్లో విజయాలతోనే కాకుండా.. వ్యక్తిగత అవార్డుల పరంగా కూడా సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఆధిపత్యం చాటుతోంది. ప్రస్తుతం ఆరెంజ్ క్యాప్, పర్పుల్ క్యాప్ రేసుల్లో టాప్‌లో సన్‌రైజర్స్ నిలిచింది. బ్యాటింగ్ విభాగంలో స్టార్ ఓపెనర్ అభిషేక్ శర్మ అద్భుత ఫామ్‌లో కొనసాగుతున్నాడు. ఇప్పటివరకు 9 మ్యాచ్‌ల్లో ఏకంగా 209.35 స్ట్రైక్ రేట్ తో 425 పరుగులు చేసి ఆరెంజ్ క్యాప్ రేసులో ఫస్ట్ ప్లేస్‌లో నిలిచాడు. ఇందులో ఒక సెంచరీ, మూడు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. తన సూపర్ బ్యాటింగ్‌తో జట్టుకు మంచి ఆరంభాలు అందిస్తున్నాడు. ఇక అభిషేక్ శర్మకు తోడుగా కాటేరమ్మ కొడుకు హెన్రిచ్ క్లాసెన్ కూడా సూపర్ ఫామ్‌తో అదరగొడుతున్నాడు. క్లాసెన్ కూడా 414 పరుగులతో రెండో స్థానంలో కొనసాగుతూ ఉన్నాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్‌లో మిడిల్ ఓవర్లలో జట్టుకు స్థిరత్వాన్ని అందిస్తూ భారీ స్కోర్లను అందిస్తున్నాడు. మరోవైపు బౌలింగ్ విభాగంలో ఇషాన్ మలింగా కళ్లు చెదిరే ప్రదర్శనతో పర్పుల్ క్యాప్ రేస్‌లో మొదటి స్థానానికి దూసుకొచ్చాడు. 9 మ్యాచ్‌ల్లో 15 వికెట్లు తీసి టాప్‌లో నిలిచాడు. అతని బౌలింగ్ సన్‌రైజర్స్ హైదరాబాద్ విజయాల్లో కీలక పాత్ర పోషిస్తోంది. డెత్ ఓవర్లలో మలింగ వేసే యార్కర్లు, వేరియేషన్స్ ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేస్తున్నాయి. అలాగే బౌలింగ్‌లో ఇషాన్ మలింగా తర్వాత భువనేశ్వర్ కుమార్, జోఫ్రా ఆర్చర్‌లు కూడా వికెట్ల వేటలో దూసుకొస్తున్నారు.



# నా సక్సెస్ సీక్రెట్ ఇదే!

ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓపెనర్ అభిషేక్ శర్మ పరుగుల సునామీ సృష్టిస్తున్నాడు. ప్రస్తుతం టీ20 ఫార్మాట్‌లో ప్రపంచ నంబర్ వన్ బ్యాటర్‌గా ఉన్న అభిషేక్, తన అద్భుతమైన ఫామ్ వెనుక ఉన్న అసలు కారణాన్ని వెల్లడించాడు. ఆస్ట్రేలియా స్టార్ ఆటగాడు, తన టీమ్ మేట్ ట్రావిస్ హెడ్ ప్రభావం తన బ్యాటింగ్ శైలిపై చాలా ఎక్కువగా ఉందని అభిషేక్ పేర్కొన్నాడు. జియో స్టార్ తో జరిగిన సంభాషణలో అభిషేక్ తన మనసులోని మాటలను పంచుకున్నాడు. హెడ్ తన బ్యాటింగ్ అప్రోచ్ ను ఎలా మార్చాడో, మైదానంలో భయం లేకుండా ఎలా ఆడాలో నేర్పించాడో వివరించాడు. ట్రావిస్ హెడ్ సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులోకి రాకముందు నుండే తాను అతని ఆటను గమనిస్తున్నానని, దాదాపు ఏడాదిన్నర కాలంగా అతని బ్యాటింగ్ స్టైల్ తనను ఆకట్టుకుందని అభిషేక్ తెలిపాడు. అతను తన టీమ్ మేట్ అయినప్పుడు తాను చాలా సంతోషించానని, అతనితో డ్రెస్సింగ్ రూమ్ పంచుకోవడం ఒక గొప్ప అనుభవమని వెల్లడించాడు. అతనితో మాట్లాడినప్పుడు మొదట అడిగింది అతని బ్యాటింగ్ మైండ్‌సెట్ గురించేనని, మూడు ఫార్మాట్లలోనూ అతను బౌలర్లపై ఎలా ఆధిపత్యం చెలాయిస్తాడో తెలుసుకోవాలని అనుకున్నానని అభిషేక్ చెప్పాడు. బ్యాటింగ్ విషయంలో ట్రావిస్ హెడ్ చాలా సింపుల్ ప్లాన్ ఫాలో అవుతాడని అభిషేక్ తెలిపాడు. "బంతిని జాగ్రత్తగా గమనించు, మొదటి బంతి నుండే బాదగలనని నీకు అనిపిస్తే ఏమాత్రం ఆలోచించకుండా షాట్ ఆడేయ్ అని హెడ్ నాకు సలహా ఇచ్చాడు. ఐపీఎల్ ప్రాక్టీస్ సెషన్లలో నేను అదే ఫాలో అయ్యాను. ఇప్పుడు నా

# రియాన్ పరాగ్‌కు భారీ షాకిచ్చిన బీసీసీఐ!



రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ సిగరెట్ వివాదాన్ని బీసీసీఐ తీవ్రంగా పరిగణించింది. అతడి మ్యాచ్ ఫీజులో 25శాతం కోత విధిస్తున్నట్లు పేర్కొంది. అలాగే పరాగ్ ఖాతాలో 1 డీమెరిట్ పాయింట్ కూడా చేర్చినట్లు తెలిపింది. ఈ మేరకు ఐపీఎల్ అడ్వైజరీ కమిటీ అధికారికంగా ఓ ప్రకటన విడుదల చేసింది. పరాగ్ ఐపీఎల్ నిబంధనలు ఉల్లఘించినట్లు ఆ ప్రకటనలో పేర్కొంది.'పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్‌లో ఐపీఎల్ ప్రవర్తనా నియమావళి కోడ్ 2.21ను రియాన్ పరాగ్ ఉల్లంఘించాడు. దీనిని లెవెల్ 1 తప్పిదంగా భావిస్తూ అతడి మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధిస్తూ, 1 డీమెరిట్ పాయింట్ చేర్చుతున్నాం' అని ఐపీఎల్ అడ్వైజరీ కమిటీ పేర్కొంది. పరాగ్ కూడా తన తప్పును అంగీకరించినట్లు తెలిసింది. అలాగే మ్యాచ్ రిఫరీ అమిత్ శర్మ విధించిన ఫైన్‌ను స్వీకరించాడు. కాగా, ఇటీవల ముల్లాన్‌పూర్ వేదికగా పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రియాన్ పరాగ్ చేసిన పని వివాదాస్పదం అయ్యింది. ఈ మ్యాచ్ సెకండ్ ఇన్నింగ్స్ 16వ ఓవర్లో డ్రెస్సింగ్ రూమ్‌లో కూర్చొని ఉన్న పరాగ్ ఈ సిగరెట్ (ఎలక్ట్రిక్ సిగరెట్) తాగుతూ కనిపించాడు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీనిపై పెద్ద దుమారమే రేగింది. డ్రెస్సింగ్ రూమ్‌లో అలాంటి పనులు చేయడంపై నెటిజన్లు సైతం పరాగ్‌పై మండిపడ్డారు. ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న బోర్డు ఈ మేరకు చర్యలు చేపట్టింది.

అయితే భారత్‌లో ఈ సిగరెట్ల వాడకంపై నిషేధం ఉంది. వీటిని కేంద్ర ప్రభుత్వం 2019లోనే బ్యాన్ చేసింది. ఎలక్ట్రిక్ సిగరెట్లు, ఆ పరికరాల ఉత్పత్తి, అమ్మకం, కొనుగోలు, వాడకాన్ని ప్రభుత్వం పూర్తిగా నిషేధించింది. దీంతో పరాగ్‌పై తీవ్ర విమర్శలు వచ్చాయి. అయితే ఈ నిబంధన ఉల్లంఘిస్తే ఎవరైనా సరే 'ప్రొహిబిషన్ ఆఫ్ ఎలక్ట్రానిక్ సిగరెట్స్ యాక్ట్ (గ్రాజుజూ) 2019' ప్రకారం రూ. లక్ష జరిమానాతోపాటు, జైలు శిక్ష కూడా ఎదుర్కోవాల్సి ఉంటుంది.

# తిరుమల శ్రీనివాసుని సన్నిధిలో.. ఘనంగా బెల్లంకొండ శ్రీనివాస్ వివాహం



టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న యువ కథానాయకుడు బెల్లంకొండ సాయి శ్రీనివాస్ ఒక ఇంటివాడయ్యారు. ఆయన తన కొత్త జీవితంలోకి అడుగుపెట్టారు. కావ్య రెడ్డితో కలిసి ఏడడుగులు వేశారు. కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి కొలువైన తిరుమల క్షేత్రంలో బుధవారం రాత్రి వీరి వివాహం అత్యంత వైభవంగా జరిగింది. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో ఈ వేడుకను శాస్త్రోక్తంగా, సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ వివాహ మహోత్సవంలో వధూవరులు బెల్లంకొండ శ్రీనివాస్, కావ్య రెడ్డి సంప్రదాయ పట్టు వస్త్రాలలో మెరిసిపోయారు. నూతన దంపతులు చూడముచ్చటగా కనిపించి అందరి దృష్టిని ఆకర్షించారు. ఈ శుభకార్యానికి తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేకంగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయనతో పాటు రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు రాజకీయ, సినీ రంగ ప్రముఖులు కూడా ఈ వేడుకకు విచ్చేసి కొత్త జంటకు శుభాకాంక్షలు తెలియజేశారు. టాలీవుడ్‌కు చెందిన పలువురు నటీనటులు, నిర్మాతలు, దర్శకులు కూడా ఈ పెళ్లికి హాజరై సందడి చేశారు.

అత్యంత సన్నిహితుల మధ్య జరిగిన ఈ వివాహ వేడుకకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తమ అభిమాన హీరో కొత్త జీవితాన్ని ప్రారంభించడంతో అభిమానులు, నెటిజన్లు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. కొత్త దంపతులు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తున్నారు.

# మోదుగ ఆకుల గంపతో అనుపమ..

## 'భోగి' నుంచి ఆకట్టుకుంటున్న ఫస్ట్ లుక్!

యంగ్ హీరో శర్వానంద్ కథానాయకుడిగా, మాస్ డైరెక్టర్ సంపత్ నంది దర్శకత్వంలో వస్తున్న భారీ యాక్షన్ డ్రామా 'భోగి'. ఈ చిత్రం నుంచి తాజాగా హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఇందులో ఆమె 'కందుల సులోచన రాణి' అనే పవర్ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. ఈ లుక్ ప్రస్తుతం సోషల్ మీడియాలో సినీ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

విడుదలైన పోస్టర్‌లో అనుపమ పూర్తి గ్రామీణ యువతి అవతారంలో కనిపించారు. కాళ్లకు చెప్పులు లేకుండా మట్టి దారిలో నడుస్తూ, తలపై మోదుగ ఆకులు నింపిన పెద్ద గంపను మోస్తున్నారు. మరో చేతిలో ఆకులు, టిఫిన్ బాక్స్ పట్టుకుని ఉన్నారు. పాతకాలపు లంగావోణి, ఆమె ముఖంలో కనిపిస్తున్న దృఢమైన భావాలు పాత్రలోని తీవ్రతను సూచిస్తున్నాయి. వెనుక మట్టి ఇళ్లు, పశువులతో కూడిన పల్లెటూరి వాతావరణం కనిపిస్తోంది. ఈ చిత్రంలో సులోచన రాణి ప్రకృతితో మమేకమై జీవించే, ఎంతో ధైర్యంగల యువతిగా కనిపించనుందని తెలుస్తోంది. మోదుగ ఆకులతో విస్తరాకులు తయారు చేస్తూ జీవనం సాగించే ఆమె పాత్రలో సహనం, బలం రెండూ ఉట్టిపడతాయని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే శర్వానంద్ పుట్టినరోజు సందర్భంగా ఆయన 'గంగ' అనే పాత్రలో నటిస్తున్నట్లు వెల్లడించిన విషయం తెలిసిందే.

1960ల ప్రారంభంలో తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల్లోని ఓ కల్పిత గ్రామంలో జరిగే పీరియడ్ యాక్షన్ డ్రామాగా 'భోగి' తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో డింపుల్ హయతి మరో కథానాయికగా నటిస్తున్నారు. ఇటీవల రాజమహేంద్రవరం, రంపచోడవరం, మారేడుమిల్లి అటవీ ప్రాంతాల్లో భారీ యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణను చిత్రబృందం పూర్తి చేసింది. తదుపరి షెడ్యూల్ మే మొదటి వారం నుంచి హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ప్రారంభం కానుంది.

భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి కిషోర్ కుమార్ అరోకియా సినిమాటోగ్రఫీ, కిరణ్ కుమార్ మన్నె ప్రొడక్షన్ డిజైన్ అందిస్తున్నారు. పాన్-ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాను రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆగస్టు 28న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.






# ప్రశాంతంగా నిద్రపోవడానికి 2062 వరకు ఆగాలేమో

దక్షిణాది చిత్రసీమలో చెక్కుచెదరని అందంతో, తిరుగులేని క్రేజ్‌తో దూసుకుపోతున్న త్రిష ఇన్‌స్టాగ్రామ్ లో పెట్టిన పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఎప్పుడూ గ్లామర్ ఫొటోలు, సినిమా అప్‌డేట్స్ ఇచ్చే త్రిష, ఈసారి తన వ్యక్తిగతమైన 'నిద్ర' గురించి చేసిన వింత లెక్క నెటిజన్లను అటు నవ్విస్తూనే, ఇటు ఆశ్చర్యానికి గురిచేస్తోంది. "ఒక గంట నిద్రను కోల్పోతే, దాని నుండి కోలుకోవడానికి నాకు నాలుగు రోజులు పడుతుంది. ఈ లెక్కన నేను మళ్ళీ ప్రశాంతంగా నిద్రపోవాలంటే 2062 వరకు ఆగాల్సిందేమో" అంటూ త్రిష చేసిన కామెంట్ వైరల్ అవుతోంది. ఆమె సరదాగా అన్నప్పటికీ, ప్రస్తుతం ఆమె షూటింగ్ షెడ్యూల్స్ ఎంత బిజీగా ఉన్నాయో, ఆమె ఎంతటి పని ఒత్తిడిని ఎదుర్కొంటున్నారో ఈ మాటలు ప్రతిబింబిస్తున్నాయి. త్రిష ప్రస్తుతం తన కెరీర్‌లో అత్యుత్తమ దశలో ఉన్నారు. మెగాస్టార్ చిరంజీవితో భారీ సోషియో ఫాంటసీ మూవీ 'విశ్వంభర'తో పాటు, తమిళంలో సూర్యతో 'కరుప్పు' వంటి క్రేజీ ప్రాజెక్టులతో ఆమె డైరీ ఫుల్ అయిపోయింది. వరుస ప్రయాణాలు, రాత్రింబవళ్లు షూటింగులతో తీరిక లేకుండా గడపడం వల్లే ఆమెకు సరైన విశ్రాంతి దొరకడం లేదని స్పష్టమవుతోంది. సినిమాలతో పాటు తన వ్యక్తిగత జీవితంపై వస్తున్న పుకార్లు, రాజకీయ అరంగేట్రంపై జరుగుతున్న ప్రచారం వంటివి కూడా ఆమెను కొంత ఒత్తిడికి గురిచేస్తుండవచ్చు. అందుకే తనకున్న మానసిక అలసటను ఇలా చమత్కారంగా సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు.

# లండన్ ప్రేమ కథతో ఆనంద్ దేవరకొండ 'ఎపిక్'..

బేబీ' బ్లాక్ బస్టర్ తర్వాత ఆనంద్ దేవరకొండ, వైష్ణవీ చైతన్య జంటగా నటిస్తున్న చిత్రం 'ఎపిక్ – ఫస్ట్ సెమిస్టర్'. 'చ90ం: ఏ మిడిల్ క్లాస్ బయోపిక్' వెబ్ సిరీస్‌తో ప్రేక్షకులను మెప్పించిన ఆదిత్య హాసన్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీ టీజర్ బుధవారం విడుదలై ఆసక్తిని రేకెత్తిస్తోంది. 'చ90ం' సిరీస్‌లో మెప్పించిన ఆదిత్య పాత్ర చుట్టూనే ఈ సినిమా కథ తిరుగుతుంది. మధ్యతరగతి కుటుంబంలో పెరిగిన ఆ యువకుడు ఇంటి సభ్యుల ఒత్తిడితో పైచదువుల కోసం యూకే వెళతాడు. అక్కడ వైష్ణవీ చైతన్యతో ప్రేమలో పడితే ఎలాంటి పరిణామాలు ఎదురయ్యాయనేది ఈ టీజర్‌లో చూపించారు. ఆనంద్ దేవరకొండ తన సహజ సిద్ధమైన నటనతో మధ్యతరగతి యువకుడిగా ఒదిగిపోయారు. పక్కా లోకల్ అబ్బాయి ఫారిన్ వెళితే పడే ఇబ్బందులను కామెడీగా చూపిస్తూనే, మరోవైపు ఎమోషనల్ లవ్ ట్రాక్‌ను కూడా ఆదిత్య హాసన్ టచ్ చేసినట్లు టీజర్‌ను బట్టి తెలుస్తోంది. యూకే నేపథ్యంలోని విజువల్స్ చాలా కలర్‌ఫుల్‌గా ఉన్నాయి. ఆనంద్, వైష్ణవి మధ్య కెమిస్ట్రీ మరోసారి వర్కవుట్ అయ్యేలా కనిపిస్తోంది. ఫస్ట్ సెమిస్టర్ అని టైటిల్‌లో ఉండటంతో ఇది యూత్, స్టూడెంట్స్ ఆడియన్స్‌ను టార్గెట్ చేసినట్లు స్పష్టమవుతోంది.






# రణ్‌వీర్ సింగ్ 'ప్రళయ్' ఆగిపోయిందన్న వార్తల్లో నిజం లేదన్న టీమ్

ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి

'ధురంధర్' ఫ్రాంచైజీతో భారీ విజయాన్ని అందుకున్న బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్, దర్శకుడు జై మెహతాతో కలిసి 'ప్రళయ్' అనే పోస్ట్-అపోకలిప్టిక్ థ్రిల్లర్ చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే, ఇటీవల ఈ ప్రాజెక్ట్ ఆగిపోయిందంటూ వార్తలు గుప్పుమన్నాయి. రణ్‌వీర్‌కు, దర్శకుడికి మధ్య సృజనాత్మక విభేదాలు తలెత్తాయని, దాంతో సినిమాను పక్కన పెట్టారని ప్రచారం జరిగింది. ఈ పుకార్లపై చిత్రబృందానికి చెందిన సన్నిహిత వర్గాలు స్పందించాయి. 'ప్రళయ్' ఆగిపోయిందంటూ వస్తున్న వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని వారు స్పష్టం చేశారు. "ప్రళయ్ సినిమా గురించి వస్తున్న ఊహాగానాలు పూర్తిగా నిరాధారమైనవి. ఈ ప్రాజెక్ట్ షెడ్యూల్ ప్రకారమే ముందుకు సాగుతోంది" అని తెలిపారు. అంతేకాకుండా, ఈ ఏడాది ఆగస్టు నుంచి సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుందని వెల్లడించారు. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయని, స్క్రిప్ట్‌ను రణ్‌వీర్, జై మెహతా ఇప్పటికే ఫైనల్ చేశారని పేర్కొన్నారు.

# అందరినీ అలరించే సినిమా

డిఫరెంట్ ఎంటర్‌టైనర్స్ చేస్తున్న తరుణ్ భాస్కర్... రైటర్–, డైరెక్టర్ కశ్యప్ శ్రీనివాస్‌తో కలిసి 'గాయపడ్డ సింహం'తో అలరించబోతున్నారు. ఈ చిత్రంలో హీరో శ్రీవిష్ణు స్పెషల్ రోల్ చేస్తున్నారు. ఈ చిత్రాన్ని పవన్ సాదినేని సమర్పణలో, కళ్యాణ చక్రవర్తి మంథిన, భాను కిరణ్ ప్రతాప, విజయ్ కృష్ణ లింగమనేని, ఉమేష్ బన్సల్ సప్తస్వ మీడియా వర్క్, పిఓవి స్టోరీస్, జీ స్టూడియోస్ బ్యానర్ల పై నిర్మించారు. ఫరియా అబ్దుల్లా, మానస చౌదరి కథానాయికలుగా నటించారు. జేడి చక్రవర్తి కీలక పాత్ర పోషించారు. 'గాయపడ్డ సింహం' విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా మేకర్స్ గ్రాండ్‌గా ప్రీ రిలీజ్ వీసా స్టాంపింగ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ ఈవెంట్‌లో హీరో శ్రీ విష్ణు మాట్లాడుతూ "డైరెక్టర్ కశ్యప్‌కి ప్రత్యేకమైన కామెడీ టైమింగ్ ఉంది. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది"అని అన్నారు. డైరెక్టర్ కశ్యప్ శ్రీనివాస్ మాట్లాడుతూ "జేడీ, తరుణ్ ఇచ్చిన సపోర్ట్‌ను ఎప్పటికీ మర్చిపోలేను. శ్రీ విష్ణు ఈ సినిమాలో భాగం కావడం మా అదృష్టంగా భావిస్తున్నాను. అందరినీ అలరించే సినిమా ఇది"అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నారా రోహిత్, జేడీ చక్రవర్తి, ఫారియా అబ్దుల్లా, మానస చౌదరి, పవన్ సాదినేని, స్వీకర్ అగస్తి, శ్రీరామ్ ఆదిత్య, సాయి మార్తాండ, హుస్సేన్ షా కిరణ్, హసిత్ గోలి, సందీప్ రాజ్, సందీప్, భాను కిరణ్, దివ్య పాల్గొన్నారు.



Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613